విలేకరులు కావలెను

పెన్ సత్తా తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759



RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు...

PEN SATTA Telugu Daily





సంపుటి : 3 | సంచిక : 189 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | ఆదివారం 30 నవంబర్ 2025 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool


## ముంచుకొస్తున్న 'దిత్వా' తుపాను భారీ వర్ష సూచన

- కోస్తా తీరం వెంట గంటకు 50 నుంచి 70 కి.మీ. వేగంతో ఈదురు గాలులు
- దక్షిణ కోస్తా, కృష్ణపట్నం పోర్టులకు మూడో నంబర్ ప్రమాద హెచ్చరిక జారీ



అమరావతి, నవంబర్ 29: దిత్వా తుపాను నైరుతి బంగాళాఖాతం, శ్రీలంక తీరాన్ని ఆనుకొని కొనసాగుతోంది. ప్రస్తుతం పుదుచ్చేరికి 300 కి.మీ, చెన్నై కి 400 కి.మీ దూరంలో కేంద్రీకృతమై ఉంది. గడిచిన 6 గంటలుగా 7 కి.మీ వేగంతో కదులుతోంది. ఆదివారం తెల్లవారుజామున తీవ్రవాయుగుండంగా తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణ కోస్తాంధ్ర తీరాలకు చేరుకునే అవకాశం ఉంది. దీని ప్రభావంతో శనివారం చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. అలాగే ప్రకాశం, నెల్లూరు, కడప, అన్నమయ్య జిల్లాల్లో అక్కడక్కడా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు విపత్తుల ప్రతిస్పందన సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. మంగళవారం వరకు మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని, ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దిత్వా ప్రభావంతో రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసే

వివరాలు 2లో..

## రాష్ట్రంలో ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా
# 3 జోన్ల ఏర్పాటు సీఎం

అమరావతి, నవంబర్ 29: రాష్ట్రంలో మూడు ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఇందుకు అనుగుణంగా 3 ప్రాంతీయ జోన్లు ఏర్పాటు చేస్తామన్నారు. అభివృద్ధి ఏ ఒక్క ప్రాంతానికో పరిమితం కాకుండా అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. రాజధాని రైతులంతా ఇక ఒకే గొడుగు కిందకు రావాలని సూచించారు. అమరావతి ప్రాంత అభివృద్ధి అసోసియేషన్ కింద అంతా ఒకే జేఏసీగా ఏర్పడితే వారితో సంప్రదిస్తూ అన్ని సమస్యలూ పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా శనివారం మీడియాతో ఇష్టాగోష్టిలో మాట్లాడిన ముఖ్యమంత్రి చంద్రబాబు పలు విషయాలను వెల్లడించారు. రాజధాని రైతులు కోరిన క్యాపిటల్ గెయిన్స్ మినహాయింపు కేంద్ర ఆర్థిక మంత్రికి వివరించామని సీఎం చంద్రబాబు తెలిపారు. కేంద్రం చర్చించి నిర్ణయం తీసుకుంటుందన్నారు. రాష్ట్ర పరిధిలో ఉన్న సమస్యలన్నీ దశలవారీగా పరిష్కరిస్తామని అన్నారు. పనులు కోసం ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లే రాజధాని రైతుల నుంచి సిబ్బంది





డబ్బులు అడిగితే తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరించారు. భూ త్యాగాలు చేసిన రైతుల సమస్యలు పరిష్కరించకుండా డబ్బులు డిమాండ్ చేస్తే కఠిన చర్యలుంటాయన్నారు.

అవినీతి నిర్మూలనకు ప్రత్యేక దృష్టి : సీఆర్డీఏ అధికారులు, సిబ్బంది పై వస్తున్న ఫిర్యాదుల పై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో అవినీతి నిర్మూలనకు ప్రత్యేక దృష్టి

వివరాలు 2లో..

## కె. విజయానంద్ పదవీకాలం పొడగించిన బాబు సర్కార్



అమరావతి, నవంబర్ 29: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కార్యదర్శి కె. విజయానంద్ పదవీకాలం మరో మూడు నెలల వరకు పొడిగించబడింది. ఈ నెలాఖరుకి ముగియాల్సిన ఆయన పదవీకాలాన్ని రాష్ట్ర ప్రభుత్వం కోరిన మేరకు కేంద్రం ఆమోదించి ఉత్తర్వులు జారీ చేసింది. విజయానంద్ 2024 డిసెంబరులో ఆంధ్రప్రదేశ్ ముఖ్య కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. 14 సంవత్సరాల ఎనర్జీ రంగ అనుభవం ఉన్న ఆయన, ఆంధ్రప్రదేశ్ ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ-2024 రూపొందించడంలో కీలక పాత్ర పోషించారు. ఈ పాలసీ రాష్ట్రాన్ని 160 జిడబ్ల్యు రెన్యూవబుల్ ఎనర్జీ హబ్ గా మార్చే లక్ష్యాన్ని పెట్టుకుంది. అలాగే, తుఫానుల సమయంలో ఎనర్జీ సరఫరాను నిర్వహించడంలో ఆయన తీరుకు ప్రశంసలు అందుకున్నారు.

వివరాలు 2లో..

## జ్వరమని వచ్చారు.. వణుకు పుట్టించారు

- గుంటూరు జీజీహెచ్‌లో వైద్యారోగ్యశాఖ కార్యదర్శి ఆకస్మిక తనిఖీలు
- వైద్యులు, సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకుంటున్న సౌరభ్‌గౌర్



శనివారం మధ్యాహ్నం 12 గంటలు.. గుంటూరు జీజీహెచ్ ఓపీ వద్దకు ఓ వ్యక్తి వచ్చారు.. తనకు జ్వరంగా ఉందని ఓపీ రాయించుకున్నారు.. అక్కడి నుంచి వైద్యుడి వద్దకెళ్లి ఆరోగ్య పరిస్థితి వివరించారు. అనంతరం

వివరాలు 2లో..

## సజ్జల విషయంలో మారిన జగన్ నిర్ణయం


తాడేపల్లి, నవంబర్ 29: రాష్ట్రంలో కూటమి నేతలు స్థానిక ఎన్నికల దిశగా వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. పంచాయితీల విలీనం, జిల్లాల పునర్విభజన వంటి అంశాల పై నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఇదే సమయంలో మాజీ సీఎం జగన్ అప్రమత్తం అయ్యారు. పార్టీలో కీలక నియామకాల పైన కసరత్తు చేస్తున్నారు. ముఖ్య నేతల బాధ్యతల్లోనూ మార్పుల దిశగా సంకేతాలు ఇస్తున్నారు. జనవరి నుంచి బస్సు యాత్రకు సిద్దం అవుతున్నారు. ఇదే సమయంలో సజ్జల బాధ్యతల పై ఆసక్తి నెలకొంది. మాజీ సీఎం జగన్ జనవరి నుంచి పార్టీకి పూర్తి సమయం కేటాయించాలని నిర్ణయించారు. ఇందు కోసం గతంతో నిర్ణయించిన విధంగా కార్యకర్తలతో సమావేశాలకు షెడ్యూల్ సిద్దం అవుతోంది. ఇక, బస్సు యాత్ర ద్వారా ప్రతీ పార్లమెంట్



వివరాలు 2లో..

## పార్లమెంటు శీతాకాల సమావేశాలు
# డిసెంబర్ 1 నుంచి ప్రారంభం

న్యూ దిల్లీ: పార్లమెంటు శీతాకాల సమావేశాలు డిసెంబర్ 1 వ తేదీ సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. డిసెంబర్ 19 వ తేదీ వరకూ ఈ సమావేశాలు జరుగుతాయి. సమావేశాలకు ముందు సంప్రదాయంగా నిర్వహించే అఖిలపక్ష సమావేశాన్ని నేడు ఆదివారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నారు. కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన ఈ అఖిలపక్ష సమావేశం జరుగనుంది. పార్లమెంటు సమావేశాలు సజావుగా జరిగేలా సహకరించాలని కేంద్రం కోరనుంది. సోమవారం నుంచి ప్రారంభమయ్యే పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో కీలకమైన పౌర అణు ఇంధన రంగంలో ప్రైవేటు రంగానికి ఆహ్వానం పలికేందుకు ఉద్దేశించిన ది ఆటమిక్ ఎనర్జీ



బిల్లు-2025 తో సహా 10 కీలక బిల్లులు సభ ముందుకు రానున్నాయి. పార్లమెంటులో ప్రవేశపెట్టనున్న కీలకమైన బిల్లులలో ది ఆటకమిక్ ఎనర్జీ బిల్లు-2025 తో

వివరాలు 2లో..

## శ్రీలంకలో చిక్కుకున్న తెలుగు పర్యాటకులు రప్పించేందుకు లోకేష్ చర్యలు



తాడేపల్లి, నవంబర్ : దిత్వా తుపాను ప్రభావంతో శ్రీలంకలో చిక్కుకున్న తెలుగు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తమను భారత్ కు తీసుకురావాలంటూ ఏపీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఏడు రోజుల పర్యటన నిమిత్తం 25 మంది తెలుగు ప్రజలు శ్రీలంక వెళ్లారు. శ్రీలంకలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఏపీ ప్రజలు లోకేష్ కు తెలిపారు. తుపాను దృష్ట్యా విమానాలు రద్దు చేసినట్లు పర్యాటకులు లోకేష్ ?కు తెలిపారు. దీంతో కొలంబోలో చిక్కుకున్న తెలుగువారిని ఆంధ్రప్రదేశ్?కు రప్పించేందుకు విద్య, ఐటీ శాఖ శాఖల మంత్రి నారా లోకేష్ చర్యలు చేపట్టారు. కొలంబో, చెన్నై అధికారులతో తక్షణ సమన్వయం చేసి, చిక్కుకున్న ప్రయాణికులకు అవసరమైన సహాయాన్ని అందించాలని ఆదేశించారు. ప్రయాణికులు సురక్షితంగా, త్వరితగతిన స్వదేశానికి చేరుకునేలా చర్యలు తీసుకోవాలని

వివరాలు 2లో..

## పవన్ కల్యాణ్‌ను ఆకట్టుకున్న
# సంగీత విన్యాసాలు

పవన్ కల్యాణ్‌ను ఆకట్టుకున్న సంగీత విన్యాసాలు






: డిసెంబర్ 4వ తేదీన జరగబోయే నేవీ డే ఉత్సవాలకు ముందస్తుగా తూర్పు ప్రాంత నావికాదళ కమాండ్ విశాఖపట్నంలో ఏర్పాటు చేసిన సర్గం 2025 - ఇండియన్ నేవల్ సింఫనిక్ ఆర్కెస్ట్రా కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శనివారం సాయంత్రం సముద్రిక ఆడిటోరియంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి విచ్చేసిన పవన్ కల్యాణ్‌కు విశాఖపట్నం విమానాశ్రయంలో నేవల్ ఆఫీసర్లు రజనీష్ శర్మ, కిషోర్, శాసన సభ్యులు కొణతాల రామకృష్ణ, వంశీ కృష్ణ యాదవ్, సుందరపు విజయ్ కుమార్, పంచకర్ల రమేష్, జిల్లా అధికారులు,

వివరాలు 2లో..

## కొలికపూడి వ్యవహారం నేను చూసుకుంటా..

### పార్టీ నేతలతో భేటీలో చంద్రబాబు



: టీడీపీ రాష్ట్ర నేతలతో సీఎం చంద్రబాబు భేటీ అయ్యారు. 2029 ఎన్నికలే లక్ష్యంగా పనిచేయాలన్నారు. కొలికపూడి అంశాన్ని తాను చూసుకుంటానని నేతలకు చెప్పారు. ఆయన విషయంలో ఎవరూ జోక్యం చేసుకోవద్దని క్రమశిక్షణ కమిటీకి సూచించారు. డిసెంబర్ 17లోగా జిల్లా, స్టేట్ కమిటీలు పూర్తి చేయాలని చెప్పారు. అంతే కాకుండా %×ఎ=ూ% ద్వారా సర్వే చేసి కమిటీలు నియమించాలని సూచించారు. ఇదిలా ఉంటే టీడీపీలో ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్ వ్యవహారం హాట్ టాపిక్ గా మారింది.కొద్దిరోజుల క్రితం గత ఎన్నికల్లో తాను ఎమ్మెల్యే టికెట్ కోసం కేశినేని చిన్నికి రూ.5 కోట్లు ఇచ్చానని ఆరోపించారు.

వివరాలు 2లో..

# కె. విజయానంద్ పదవీకాలం పొడగించిన బాబు సర్కార్

మొదటి పేజీ తరువాయి
పెట్టామని త్వరలోనే ఆ దిశగా కార్యచరణ రూపొందిస్తామని తెలిపారు. రైతు సమస్యల పరిష్కారంలో తొలుత కొంత గ్యాప్ ఉందన్నా సీఎం తనతో సమావేశం తర్వాత అన్నింటి పైనా స్పష్టత వచ్చిందన్నారు. రైతులు కూడా ఆనందంగా ఉన్నారని వెల్లడించారు. రెండో దశ భూ సమీకరణ ఉపయోగాల పై రైతులకు వివరించానన్నారు. మున్సిపాలిటీగా అమరావతి మిగిలిపోకుండా మహానగరంగా అభివృద్ధి చెందితే ఎలాంటి ఫలితాలు ఉంటాయో రైతులు అర్థం చేసుకున్నారన్నారు. త్రిసభ్య కమిటీ నిరంతరం రైతులతో సంప్రదింపులు జరుపుతుందని తెలిపారు. రాజధాని అభివృద్ధి ఇక అన్ స్టాపబుల్ అన్నారు. రాజధాని చుట్టపక్కల ప్రాంతాల్లో లే అవుట్లకు అనుమతుల సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని తెలిపారు. గోదావరి పుష్కరాల నాటికి పోలవరం పూర్తి చేసే దిశగా కృషి చేస్తున్నామని చంద్రబాబు స్పష్టం చేశారు. మరో వైపు అమరావతి నగర విస్తరణకు ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి పనులు

చేపడుతోంది. దీని కోసం ఇప్పటికే కొన్ని గ్రామాలనుంచి భూ సమీకరణ చేసింది. తొలి దశలో 29 గ్రామాల నుంచి భూమిని సమీకరించగా తాజాగా మరోసారి ప్రభుత్వం దీని పై కీలక నిర్ణయం తీసుకుంది. మరోసారి అమరావతికి దగ్గరగా ఉన్న 7 గ్రామాల పరిధిలో భూ సమీకరణకు ప్రణాళిక రూపొందించింది. మొత్తం 16,666 ఎకరాల భూమిని సేకరించనుంది. రెండో విడతలో సేకరించిన భూములలో ప్రధానమైనవి నిర్మించాలని ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. అవి అంతర్జాతీయ విమానాశ్రయం, రైల్వేస్టేషన్?, రైల్వేలైన్? నిర్మాణాలు చేయనున్నారు. వీటన్నింటికి మార్గం సుగమమైంది. దీనితోపాటు రాజధాని ప్రాంతంలో నిర్మిస్తున్న ఉత్తర-దక్షిణం, తూర్పు, పడమర రహదారులు ఇన్నర్ రింగ్ రోడ్డు తో అనుసంధానం కానున్నాయి. అమరావతి నగర పరిధి విస్తరిస్తుండటం వల్ల పలు జాతీయ, అంతర్జాతీయ కంపెనీలకు భూముల కేటాయింపుకు స్థలాలు అందుబాటు లోకి రానున్నాయి. దీని వల్ల పెట్టుబడులు పెట్టడానికి వ్యాపారవేత్తలు ముందుకొస్తున్నారు. అదేవిధంగా రాష్ట్రంలో నూతన ఆవిష్కరణలతో పాటు ఉపాధి అవకాశాలు పెరగుతాయని చర్చ జరుగుతుంది. ఈ విధంగా అమరావతిని నవ్యాంధ్ర రాజధానిగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం ముందుకు వెళ ్తుంది.

# ముంచుకొస్తున్న ‘దిత్వా’ తుపాను భారీ వర్ష సూచన

మొదటి పేజీ తరువాయి
అవకాశం ఉందని విశాఖ వాతావరణ శాఖ అధికారి జగన్నాథ కుమార్ తెలిపారు. నైరుతి బంగాళాఖాతం, శ్రీలంక తీరాన్ని ఆనుకుని ‘దిత్వా’ తుపాను కొనసాగు తోందన్నారు. దిత్వా తుపాను దృష్ట్యా నేడు (ఆదివారం) అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, తెల్లవారు జామున తీవ్రవాయు గుండంగా మారే అవకాశం ఉందన్నారు. డిసెంబర్ 1 న ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ ఉండనున్నట్లు తెలిపారు. కోస్తా తీరం వెంట 50 నుంచి, 70 కి.మీ. వేగంతో ఈదురు గాలులు వీస్తాయని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. దక్షిణ కోస్తా, కృష్ణపట్నం పోర్టులకు 3 వ నంబర్, గిలిన ఓడరేవు లకు రెండో నంబర్ ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. 24 గంటల్లో నెల్లూరు, చిత్తూరు, తిరుపతిలో ఆకస్మిక వర్ష సూచన ఉన్నట్లు తెలిపారు. భారీ వర్షాల దృష్ట్యా కొన్ని జిల్లాలకు రెడ్, ఆరెంజ్, ఎల్లో అలర్ట్ జారీ చేశారు. ఆదివారం : తుపాను దృష్ట్యా రేపు నెల్లూరు, తిరుపతి, చిత్తూరు జిల్లాలకు రెడ్ అలెర్ట్. ప్రకాశం, కడప, అన్నమయ్య జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ. నంద్యాల, అనంతపురం, సత్యసాయి జిల్లాలకు ఎల్లో అలెర్ట్. మంత్రులకు సీఎం సూచనలు : దిత్వా తుపాను దృష్ట్యా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు, హోం మంత్రి అనిత, మంత్రి గొట్టిపాటి రవి అధికారులను ఆదేశించారు. తుపాను వల్ల నష్టం జరగకుండా ప్రణాళిక ప్రకారం జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం సూచించారు. ఇన్‌ఛార్జి మంత్రులు వారికి కేటాయించిన జిల్లాల్లో ఉండి పర్యవేక్షించాలని తెలిపారు. దిత్వా తుపాను హెచ్చరికల నేపథ్యంలో విపత్తుల ప్రతిస్పందన సంస్థ కార్యాలయంలో హోం మంత్రి అనిత ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. తుఫాన్ నేపథ్యంలో అధికార యంత్రాంగం క్షేత్ర స్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండాలని, అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని హోం మంత్రి అనిత అదేశించారు. ఎక్కువగా ప్రభావం చూపే తిరుపతి, చిత్తూరు, కడప, నెల్లూరు, ప్రకాశం జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలకు హోం మంత్రి ఆదేశాలు జారీ చేశారు. ఎక్కడా ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూడాలని సూచించారు. శిథిలావస్థ లోని ఇళ్లలోని వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని తెలిపారు. యంత్రాంగం అనుక్షణం అలర్ట్‌గా ఉండాలి : తుపాను తీవ్రతను అంచనా వేసి ప్రభావిత జిల్లాలను అలెర్ట్ చేయాలన్నారు. తుపాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో ఫోన్ లో మాట్లాడి ముందస్తు జాగ్రత్త చర్యలు పటిష్ఠంగా అమలు చేయాలన్నారు. సహాయక చర్యల కోసం ఎస్‌డీఆర్‌ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలను పంపించాలని ఆదేశించారు. రేపు, ఎల్లుండి దక్షిణ కోస్తా జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్ష సూచన ఉందని అధికారులు వివరించారు. ఎటువంటి ప్రాణనష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. తుపాను సమాచారాన్ని ఎప్పటికప్పుడు అధికారులకు, ప్రజలకు తెలియజేయాలన్నారు. క్షేత్ర స్థాయిలో అధికార యంత్రాంగం అనుక్షణం అలర్ట్‌గా ఉండాలని సూచించారు.

# పార్లమెంటు శీతాకాల సమావేశాలు డిసెంబర్ 1 నుంచి ప్రారంభం

మొదటి పేజీ తరువాయి
పాటు సెక్యూరిటీస్ మార్కెట్స్ కోడ్ బిల్లు (ఎస్ఎంసి)-2025, జాతీయ రహదారుల (సవరణ) బిల్లు, అర్బిట్రేషన్, కాన్సిలియేషన్ (సవరణ) బిల్లు, ఇన్సూరెన్స్ చట్ట (సవరణ) బిల్లు, ఇన్సాల్వెన్సీ, దివాలా కోడ్ (సవరణ) బిల్లు, కార్పొరేట్ చట్ట (సవరణ) బిల్లు, ది హైయర్ ఎడ్యుకేషన్ కమిషన్ ఆఫ్ ఇండియా బిల్లు-2025, ది మణిపూర్ గూడ్స్ అండ్ సర్వీసెస్ టాక్స్ (సవరణ) బిల్లు-2025, జన్ విశ్వాస్ (నిబంధనల సవరణ) బిల్లు-2025 ఉండనున్నాయి.
సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా చట్టం-1992, డిపాజిటరీస్ చట్టం-1996, సెక్యూరిటీస్ కాంట్రాక్ట్స్ (నియంత్రణ) చట్టం-1956లను విలీనం చేసేందుకు ‘సెక్యూరిటీస్ మార్కెట్స్ కోడ్ బిల్లు-2025’ను కేంద్రం తీసుకువస్తోంది. జాతీయ రహదారుల విస్తరణ, పొడిగింపుకోసం
అవసరమైన భూసేకరణ ప్రక్రియ వేగంగా, అత్యంత పారదర్శకంగా జరిగేందుకు వీలుగా నేషనల్ హైవేస్ (సవరణ) బిల్లును తెస్తోంది. చేయని తప్పులకు కంపెనీ డైరెక్టర్లు బాధ్యులు అవుతున్నందున అవాంఛనీయ దర్యాప్తు, విచారణల నుంచి రక్షణ కల్పించాలని సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు ఆర్బిట్రేషన్, కాన్సిలేయేషన్ చట్ట సవరణ బిల్లును పార్లమెంటులో కేంద్రం ప్రవేశపెట్ట నుంది. దీని పై సూచనల కోసం కమిటీకి సిఫారసు చేసే అవకాశం ఉంది. కాగా, ది హయ్యర్ ఎడ్యుకేషన్ కమిషన్ ఆఫ్ ఇండియా బిల్లుతో ఏకీకృత ఉన్నత విద్యా కమిషన్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం కొత్త బిల్లు తీసుకురానుంది. కాగా, చండీగఢ్ కేంద్ర పాలిత
ప్రాంతాన్ని రాజ్యాంగం లోని 240 వ అధికరణ పరిధి లోకి తెచ్చే బిల్లు పార్లమెంటులో ప్రవేశపెడతారని అనుకున్నప్పటికీ అలాంటి ఆలోచన ఏదీ లేదని ఇటీవల కేంద్రం ప్రకటించింది. కాగా, ఈసారి పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో పలు అంశాలను లేవనెత్తేందుకు విపక్షాలు కసరత్తు చేస్తున్నాయి. ప్రధానంగా ఎస్ఐఆర్ ఓటర్ల సవరణ జాబితా, అదానీ అంశం, ఢిల్లీ పొల్యూషన్ వంటి అంశాలను లేవనెత్తే అవకాశాలున్నాయి.

# సజ్జల విషయంలో మారిన జగన్ నిర్ణయం

మొదటి పేజీ తరువాయి
పరిధిలో కార్యకర్తలతో సమావేశం కావాలని జగన్ తాజాగా నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో పార్టీ లోని ముఖ్య నేతల బాధ్యతల్లోనూ మార్పులు చేస్తున్నట్లు సమాచారం. పార్టీలో కీలకంగా ఉన్న సజ్జల, వైవీ, కొడాలి నాని, పేర్ని నాని, బొత్సా, కన్నబాబు వంటి నేతల బాధ్యతల పైన జగన్ కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. సాయిరెడ్డి పార్టీ వీడిన తరువాత జగన్ పక్కన ఈ నేతలు కీలకంగా మారారు. కొందరు సీనియర్లు పార్టీ వీడారు. ఇక ఇప్పుడు రీజనల్ నాయకత్వం పైన జగన్ కొత్త వ్యూహాలు అమలు చేస్తున్నారు. అదే విధంగా పార్టీ అధికార ప్రతినిధులు, సమన్వయం కోసం కొత్త టీం కు రూప కల్పన చేస్తున్నట్లు తెలుస్తోంది. పార్టీ నేతలు బొత్సా, కన్నబాబు, శైలజానాథ్, సతీష్ రెడ్డి, మేకపాటి విక్రమ్, అనంత వెంకట రామి రెడ్డి, కల్యాణి, మార్గాని భరత్ వంటి వారికి కీలక బాధ్యతలు దక్కే అవకాశం కనిపిస్తోంది. అయితే, పార్టీ 2024 ఎన్నికల్లో ఓటమి తరువాత సజ్జల పైన కొందరు పార్టీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేసారు. జగన్ - పార్టీ మధ్య సమన్వయంలో విఫలమయ్యారనే చర్చలు జరిగాయి. ఒక దశలో సజ్జల పార్టీ ప్రత్యక్ష వ్యవహారాల నుంచి తప్పుకుంటారని ప్రచారం సాగింది. అయితే, వైవీ సుబ్బారెడ్డి సహా పలువురు నేతలు కేసులు ఎదుర్కొంటున్నారు. దీంతో సజ్జల విషయంలో ఎలాంటి నిర్ణయం ఇప్పటి వరకు జరగలేదు. కాగా కొంత కాలంగా తిరిగి సజ్జల పార్టీలో క్రియా శీలకంగా మారారు. కీలక అంశాల పైన స్పందిస్తున్నారు. సజ్జల రామకృష్ణా రెడ్డి పైన కూడా అనేక కేసులు నమోదయ్యాయి. అయితే వాటిలో ముందస్తు బెయిల్ తెచ్చుకున్నారు. సాయి రెడ్డి సైతం పరోక్షంగా జగన్ కోటరీ అంటూ సజ్జల పైనే విమర్శలు చేసినట్లు చర్చ ఉంది. కాగా ఇప్పుడు సజ్జల కీలకంగా తిరిగి వ్యవహరిస్తున్న తీరుతో జగన్ నిర్ణయం మారిందా, లేక త్వరలో జరిగే నేతల బాధ్యతల మార్పుల్లో సజ్జల పైనా నిర్ణయం ఉంటుందా అనేది పార్టీలో ఆసక్తి కరంగా మారుతోంది.

## జ్వరమని వచ్చారు.. వణుకు పుట్టించారు

మొదటి పేజీ తరువాయి
ఫార్మసీకి వెళ్లి వరుసలో నిల్చుని మందులు తీసుకున్నారు. దాదాపు గంట వ్యవధిలో అనేక విభాగాలను సందర్శించారు. కొద్దిసేపటికి సూపరింటెండెంట్ ఆయన వద్దకు వచ్చి నమస్కరించడంతో అక్కడ ఉన్న వైద్యులు, సిబ్బంది విస్తుపోయారు. జ్వరంతో ఉన్నానంటూ వచ్చిన ఆ వ్యక్తి.. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి సౌరభ్‌గౌర్ కావడమే దీనికి కారణం. అధికారులకు సమాచారం ఇవ్వకుండా సామాన్య రోగిలా వచ్చారు. గంట తర్వాత రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖ వర్గాల నుంచి జీజీహెచ్ అధికారులకు సమాచారం రావడంతో ఉలిక్కిపడ్డారు. వెంటనే ఆఘమేఘాలపై ఆయన వద్దకు చేరుకుని పరిస్థితిని వివరించారు.
జీజీహెచ్ అధికారులు వచ్చి కలిసేటప్పటికి సౌరభ్ ఆర్థోపెడిక్ ఓపీ వద్ద ఉన్నారు. అనంతరం సూపరింటెండెంట్‌ను వెంటబెట్టుకుని అనేక విభాగాల్లో కలియతిరిగారు. ఓ పీజీ విద్యార్థి రోగులతో కటువుగా మాట్లాడుతుండడంతో తర్వాత పిలిచి మాట్లాడినట్లు సమాచారం.మందుల పేర్లను స్లిప్పులపై రాయడంపై అభ్యంతరం వ్యక్తం చేసిన ఆయన.. ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ల్యాబ్‌లో మాడ్యూల్స్‌ను గంటకుపైగా పరిశీలించారు. వైద్యుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, ప్రతి వైద్యుడికి సంబంధించి కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్ తీసుకున్నారు. మెడికల్ ఓపీలో పరిస్థితిపైనా ఆరా తీసినట్లు జీజీహెచ్ వర్గాలు తెలిపాయి.

## కొలికపూడి వ్యవహారం నేను చూసుకుంటా..

మొదటి పేజీ తరువాయి
తరవాత కొలికపూడి అబద్దాలు ఆడుతున్నారని ఆయన వ్యాఖ్యలను చిన్ని ఖండించారు. అప్పటి నుండి కొలికపూడి తరచూ వార్తల్లో నిలుస్తున్నారు. తాజాగా చాలా మంది తనపై దుష్ప్రచారం కావాలని అనుకుంటున్నారని చెప్పారు. ఆ విషయం తిరువూరులో ఉన్న ప్రతిఒక్కరికీ తెలుసన్నారు. పార్టీలు, కులాలకు అతీతంగా టీడీపీకి వ్యతిరేకంగా ఓటేసినవాళ్లు కూడా ఇప్పుడు ఎమ్మెల్యే అంటే నాలా ఉండాలంటున్నారని వ్యాఖ్యానించారు.

## పవన్ కల్యాణ్‌ను ఆకట్టుకున్న సంగీత విన్యాసాలు

మొదటి పేజీ తరువాయి
ప్రజా ప్రతినిధులు స్వాగతం పలికారు. అక్కడి నుంచి నేరుగా ఈస్టర్న్ నావల్ కమాండ్ లోని శౌర్య అతిథి గృహం చేరుకున్నారు. ఉప ముఖ్యమంత్రితో విశాఖ పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి సమావేశమయ్యారు. అనంతరం పవన్ కల్యాణ్ సముద్రిక చేరుకున్నారు. చీఫ్ అడ్మిరల్ సంజయ్ భల్లా, ఆయన సతీమణి ప్రియా భల్లా స్వాగతం పలికారు.

**అలరించిన నేవీ బ్యాండ్**

సర్గం 2025లో భాగంగా తూర్పు ప్రాంత నావికాదళ సింఫనీక్ బ్యాండ్ లయబద్దంగా చేసిన సంగీత విన్యాసాలు ఆకట్టుకున్నాయి. మ్యూజిక్ కంపోజర్, ఈస్టన్ నావెల్ కమాండ్ బ్యాండ్ డైరెక్టర్ సతీష్ ఛాంపియన్, ఈస్టన్ నావెల్ బ్యాండ్ డిప్యూటీ డైరెక్టర్ ప్రదీప్ కుమార్‌లు లయబద్ధంగా సంగీతానికి దర్శకత్వం వహించగా, దేశభక్తి గీతాలు, హిందీ పాటలతో పాటు ఎన్విరాన్మెంట్ సంబంధిత అంశాలపై కూడా ఈస్టన్ నేవీ బ్యాండ్ చేసిన సంగీతం అందరిని ఆకట్టుకుంది. సుమారు గంటకు పైగా చేసిన ఈ సంగీత విన్యాసాలు అందరిని సమ్మోహితం చేశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన పవన్ కల్యాణ్ చేతుల మీదుగా లయన్ కింగ్ మ్యూజిక్ మెమొంటోను శరత్ కుమార్ సింగ్ బాబుకి అందజేశారు. తూర్పు ప్రాంత నావికాదళ కమాండ్ వైస్ అడ్మిరల్ సంజయ్ భల్లా చేతుల మీదుగా పవన్ కల్యాణ్ టోకెన్ ఆఫ్ రెమెంబెన్స్ స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పవన్ కల్యాణ్ కుమారుడు అకీరా నందన్ పాల్గొన్నారు.

## శ్రీలంకలో చిక్కుకున్న తెలుగు పర్యాటకులు రప్పించేందుకు లోకేష్ చర్యలు

మొదటి పేజీ తరువాయి
తన కార్యాలయానికి స్పష్టం చేశారు. తెనాలి, హైదరాబాద్, గుంటూరు, విజయవాడ, విశాఖ నుంచి 25 మంది బృందం కొలంబో వెళ్లింది. తుఫాను కారణంగా అక్కడ చిక్కుకు వీరు వీడియో ద్వారా తమను భారత్ కి తీసుకురావాలి అని కోరారు, దీనికి వెంటనే స్పందించిన లోకేష్ చర్యలు చేపట్టారు. మరో వైపు నైరుతి బంగాళాఖాతం లోని శ్రీలంక తీరంలో ఏర్పడిన ‘దిత్వా’ తుపాను ఉత్తర - వాయువ్య దిశగా వేగంగా కదులుతోంది. ప్రస్తుతం ట్రికోమలికి వాయువ్యంగా 80 కి.మీలు, పుదుచ్చేరికి దక్షిణ ఆగ్నేయంగా 330 కి.మీలు, చెన్నైకి దక్షిణంగా 430 కి.మీల దూరంలో కేంద్రీకృతమై ఉంది. దిత్వా తుపాను శ్రీలంకలో బీభత్సం సృష్టిస్తోంది. దీని ప్రభావంతో అక్కడ భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురుస్తున్నాయి.

## ఇది మామూలు అభిమానం కాదు.. ‘అఖండ 2’ టికెట్‌కు రూ. 2 లక్షలు

నందమూరి బాలకృష్ణ, దర్శకుడు బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో వస్తున్న చిత్రం ‘అఖండ 2’పై అభిమానుల్లో ఏ స్థాయిలో అంచనాలు ఉన్నాయో చెప్పడానికి ఈ ఒక్క సంఘటన చాలు. జర్మనీకి చెందిన ఓ ఎన్ఆర్ఐ అభిమాని ఈ సినిమా టికెట్‌ను ఏకంగా రూ. 2 లక్షలు పెట్టి కొనుగోలు చేసి అందరినీ ఆశ్చర్యపరిచారు.
‘అఖండ 2’ చిత్రం డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న నేపథ్యంలో ఓవర్సీస్‌లో అడ్వాన్స్ బుకింగ్స్ ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్‌లో నివసించే రాజశేఖర పర్ణపల్లి అనే బాలయ్య వీరాభిమాని, తన అభిమాన హీరో సినిమా కోసం ఏకంగా రూ. 2,00,000 చెల్లించి ఒక టికెట్‌ను దక్కించుకున్నారు.సాధారణంగా అభిమానం ప్రదర్శించడానికి ఎన్నో మార్గాలు ఉంటాయి. కానీ, ఒకే టికెట్ కోసం ఇంత పెద్ద మొత్తంలో ఖర్చు చేయడం నందమూరి బాలకృష్ణకు ఉన్న క్రేజ్‌కు నిదర్శనంగా నిలుస్తోంది. ఈ అరుదైన విషయాన్ని చిత్రబృందం సోషల్ మీడియా ద్వారా పంచుకుంది. దీంతో ఈ వార్త ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది.

# ఇండోనేషియా తో భారత్ ఆయుధ ఒప్పందానికి రెడీ




**ఇంటర్నెట్ డెస్క్:** పాకిస్థాన్ పై భారత్ చేపట్టిన ఆపరేషన్ సింధూర్ లో భారత్ కు చెందిన అత్యాధునిక క్షిపణి వ్యవస్థ బ్రహ్మోస్ పాకిస్థాన్ లోని ఎయిర్ బేస్ లను ధ్వంసం చేసిన సంగతి తెలిసిందే. పాకిస్థాన్ లో విధ్వంసం సృష్టించిన బ్రహ్మోస్ క్షిపణి వ్యవస్థను ప్రపంచం లోనే అతిపెద్ద ముస్లిం దేశం అయిన ఇండోనేషియా కొనుగోలు చేసేందుకు సిద్ధమైంది. ఇండోనేషియా రక్షణమంత్రి జఫ్రీ జమ్స్రొద్దిన్ భారత్ లో రెండు రోజుల పాటు పర్యటించిన నేపథ్యంలో ఈ డీల్ కుదిరింది. ఈ మేరకు దిల్లీ లోని బ్రహ్మోస్ క్షిపణి ప్రొడక్షన్ యూనిట్ ను సందర్శించారు. ఈ మిసైల్ కు సంబంధించిన పూర్తి వివరాలను అక్కడి అధికారులతో అడిగి తెలుసుకున్నారు. అనంతరం భారత రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ తో సమావేశం అయ్యారు. భారత్ కు చెందిన సూపర్‌సోనిక్ క్రూయిజ్ మిసైల్ బ్రహ్మోస్ ని కొనుగోలు చేయడానికి ప్రపంచం లోనే అతిపెద్ద ముస్లిం దేశంగా పేరుగాంచిన ఇండోనేషియా సిద్ధం అయింది. ఈ మేరకు భారత్- ఇండోనేషియా మధ్య ఈ ఒప్పందం పై త్వరలోనే ఇరు దేశాల ప్రతినిధులు సంతకాలు చేయనున్నారు. బ్రహ్మోస్ క్షిపణి లోని మూడు వెర్షన్లను అంటే ల్యాండ్, నేవల్, ఎయిర్ ఫోర్స్ ను కొనుగోలు చేయాలని ఇండోనేషియా ఆసక్తిని ప్రదర్శిస్తోంది. వీటి కొనుగోలు ద్వారా భారత్ తో తమ సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవాలని ఆ దేశం భావిస్తోంది. ఇక ఈ బ్రహ్మోస్ క్షిపణి ఒప్పందం విలువ రూ. 38,770 మిలియన్లు ఉంటుందని నివేదికలు చెబుతున్నాయి. అలాగే ఈ క్షిపణులను కొనుగోలు చేసేందుకు భారత్ తమ జాతీయ బ్యాంకుల నుంచి ఇండోనేషియాకు రుణం కూడా అందించేందుకు సిద్ధం అయినట్లు సమాచారం. ఈ ఒప్పందంతో ఇరు దేశాల మధ్య దౌత్య సంబంధాలు మరింత బలోపేతం కానున్నాయి. ఇక ప్రపంచం లోనే అతిపెద్ద ముస్లిం దేశం అయిన ఇండోనేషియాకు భారత్ నుంచి బ్రహ్మోస్ ను కొనుగోలు చేయడం పాకిస్థాన్, చైనాలకు కీలక సందేశంగా మారవచ్చని నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. ఇక పాకిస్థాన్ తయారు చేసిన బాబర్, షాహీన్, ఘోరి వంటి క్షిపణులను విక్రయించడానికి సుముఖంగా ఉన్నప్పటికీ, ఇండోనేషియా వాటిని కొనుగోలు చేయలేదు. దాంతో పాకిస్థానీ క్షిపణుల పై ఇండోనేషియాకు నమ్మకం లేదని స్పష్టం అవుతోంది. ఇక ఫిలిప్పీన్స్ తర్వాత బ్రహ్మోస్ ను కొనుగోలు చేసిన రెండో దేశంగా ఇండోనేషియా నిలిచింది. మరోవైపు వియత్నాం, మలేషియా, బ్రెజిల్, అర్జెంటీనా, వెనిజులా, సౌదీ అరేబియా, ఈజిప్ట్.. తదితర దేశాలు కూడా బ్రహ్మోస్ క్షిపణి కొనుగోలు పై ఆసక్తి చూపిస్తున్నాయి. ఇక బ్రహ్మోస్ క్షిపణి ప్రపంచం లోనే అత్యంత వేగవంతమైన, అధునాతన సూపర్ సోనిక్ క్రూయిజ్ క్షిపణిగా పేరుంది. దీని వేగం మ్యాక్ 2.8.. లేదా గంటకు 3,450 కి.మీ. ఉంటుంది. దీని పరిధి 290 కి.మీ. గా ఉంది.

# భారత్ తో సైనిక ఒప్పందాన్ని ఆమోదించనున్న రష్యా పార్లమెంట్

డిసెంబర్ 4, 5 తేదీల్లో భారత్ పర్యటనకు రానున్న పుతిన్-




**రష్యా :** రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మరికొన్ని రోజుల్లో భారత పర్యటనకు రానున్న వేళ మాస్కో కీలక నిర్ణయం తీసుకుంది. భారత్ తో చేసుకున్న సైనిక ఒప్పందాన్ని ఆ దేశ పార్లమెంట్ లో ఆమోదించనున్నట్లు తెలుస్తోంది. ఈ ఒప్పందం తో సైనిక రంగంలో రష్యా, భారత్ ల మధ్య సహకారం బలోపేతం కానుంది. మాస్కో రక్షణ మంత్రి అలెగ్జాండర్ ఫోమిన్, భారత రాయబారి వినయ్ కుమార్ లు సంబంధిత పత్రాల పై సంతకాలు చేశారు. అంతే కాకుండా డిసెంబరు 4, 5 తేదీల్లో భారత్‌లో పుతిన్ పర్యటించనున్నట్లు రష్యా అధ్యక్ష కార్యాలయం క్రెమ్లిన్ తెలిపింది. ప్రధాని మోదీ ఆహ్వానం మేరకు ఆయన ఈ పర్యటన చేపట్టనున్నట్లు వెల్లడించింది. దీంతో మోదీ, పుతిన్ ల మధ్య ద్వైపాక్షిక భేటీ జరగనుంది. ఆయన గౌరవార్థం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రత్యేక విందు ఇవ్వనున్నారు. దీంతో ఇరుదేశాల మధ్య బలమైన సైనిక సహాకారం, పటిష్ఠ మైన వాణిజ్య బప్పందాలకు మార్గం సుగమమం అవుతుందని భావిస్తున్నారు. ఈ ఒప్పందం కేవలం ఇరు దేశాల అభివృద్ధికే కాకుండా ఇతర దేశాలతో పాటు చైనా ఆగడాలను కట్టడి చేయాడానికి కూడా ఈ ఒప్పంద ఉపయోగపడుతుందని నిపుణుల ఆభిప్రాయం. మరో వైపు పుతిన్ పర్యటనలో భాగంగా ఇరుదేశాల మధ్య పలు ఒప్పందాలు జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. రష్యా ఆర్థిక వ్యవస్థకు భవన నిర్మాణం, జౌళి, ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో నిపుణుల కొరత ఏర్పడింది. ఈ క్రమంలో 70 వేల మందికి పైగా భారతీయ కార్మికులు, నిపుణులకు రష్యాలో ఉద్యోగాలు లభిస్తాయని అంచనా, ఈ మేరకు ఇరుదేశాలు ఒప్పందం కుదుర్చుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఎస్-400 క్షిపణుల కొత్త బ్యాచ్ కొనుగోలు పై సైతం చర్చలు: ఇదిలా ఉండగా, మోదీతో జరిగే భారత్, రష్యా 23 వ వార్షిక శిఖరాగ్ర సదస్సులో వాణిజ్యం, రక్షణ తదితర అంశాల పై మోదీ, పుతిన్? ప్రధానంగా చర్చించనున్నారు. ఈ సందర్భంగా కొన్ని కీలక ఒప్పందాలూ కుదిరే అవకాశం ఉంది. మరో వైపు భారత్ పై అమెరికా 50 శాతం సుంకాలు విధించిన నేపథ్యంలో ఈ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. రూపాయి- రూబుల్‌తో ద్వైపాక్షిక వాణిజ్యం బలోపేతం చేసే మార్గాలు, పాశ్చాత్యదేశాలు రష్యాపై విధించిన ఆంక్షల నేపథ్యంలో ఇంధన సహకారాన్ని ముందుకు తీసుకువెళ్లడం, రక్షణ సంబంధాలను బలోపేతం చేసుకోవడం, ఉక్రెయిన్ వివాదం, పౌర అణుశక్తి తదితర కీలక అంశాలు ఇరుదేశాధినేతల మధ్య చర్చకు రానున్నట్లు తెలుస్తోంది. ఆపరేషన్ సిందూర్‌లో అద్భుతంగా పనిచేసిన ఎస్-400 క్షిపణుల కొత్త బ్యాచ్ కొనుగోలుపై సైతం చర్చలు జరిగే ఉన్నట్లు తెలుస్తోంది. ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభానికి కొన్ని నెలల ముందు 2021 డిసెంబరులో రష్యా అధ్యక్షుడు పుతిన్ భారత్‌లో పర్యటించారు. ఆ తర్వాత ఆయన మన దేశానికి రానుండడం ఇదే తొలిసారి. అంతకుముందు ప్రధాని మోదీ, పుతిన్‌లు గత ఏడాది రెండుసార్లు భేటీ అయ్యారు. జులైలో ఇరుదేశాల శిఖరాగ్ర సమావేశంలో భాగంగా మోదీ రష్యాకు వెళ్లారు. ఆ తర్వాత అక్టోబర్‌లో బ్రిక్స్ సదస్సు సందర్భంగా రష్యాలోని కజన్‌లో మరోసారి వీరిద్దరూ సమావేశమయ్యారు. ఇటీవల చైనాలో జరిగిన షాంఘై సహకార సంస్థ సదస్సులో పుతిన్-మోదీలు భేటీ అయి పలు అంశాల పై చర్చించారు.

# హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో నిబంధనల ఉల్లంఘన..




## షాకిచ్చిన ఆర్‌బీఐ ఖాతాదారుల పై ప్రభావం ఉంటుందా?

**బిజినెస్ డెస్క్ :** దేశీయ ప్రైవేట్ బ్యాంకింగ్ రంగం లోని దిగ్గజ బ్యాంక్ అయిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఝులక్ ఇచ్చింది. వివిధ కేటగిరీల్లో నిబంధనలు ఉల్లంఘించినట్లు గుర్తించిన క్రమంలో భారీగా పెనాల్టీ వేసింది. కేవైసీ, వడ్డీ రేట్ల వంటి వాటిల్లో మార్గదర్శకాలు పాటించలేదని పేర్కొంది. మరి ఆ బ్యాంకు ఖాతాదారుల పై ఆర్‌బీఐ పెనాల్టీ తో ఎలాంటి ప్రభావం ఉంటుంది?. నిబంధనలు ఉల్లంఘిస్తున్న బ్యాంకుల పై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) కొరడా ఝులిపిస్తోంది. ఈసారి ఏకంగా దిగ్గజ బ్యాంకు కు భారీగా పెనాల్టీ వేసింది. ప్రైవేట్ రంగం లోని అతిపెద్ద బ్యాంకు అయిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ లిమిటెడ్‌కు ఏకంగా రూ.91 లక్షల పెనాల్టీ వేసినట్లు ఓ ప్రకటనలో తెలిపింది. బ్యాంకింగ్ రెగ్యులేషన్ యాక్ట్ 1949 నిబంధనల ఉల్లంఘన, అడ్వాన్సుల పై వడ్డీ రేట్లు, ఔట్‌సోర్సింగ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ విషయంలో ఆర్‌బీఐ మార్గదర్శకాలను విస్మరించడంతో పాటు నో యువర్ కస్టమర్ (కేవైసీ) నిబంధనలను ఉల్లంఘించినట్లు గుర్తించిన క్రమంలో ఈ మేరకు పెనాల్టీ వేయాల్సి వచ్చిందని తెలిపింది. దీని తో ఖాతాదారుల పై ప్రభావం ఉంటుందా?: బ్యాంకులో రూల్స్ ఉల్లంఘన జరిగి భారీగా పెనాల్టీ వేసిందన్న వార్తలతో ఖాతాదారులు ఆందోళన చెందే అవకాశం ఉంది. ఈ క్రమంలో రిజర్వ్ బ్యాంక్ క్లారిటీ ఇచ్చింది. నిబంధనలు, మార్గదర్శకాలు పాటించే అంశం పైనే పెనాల్టీలు వేయడం జరిగిందని, కస్టమర్ల ట్రాన్సాక్షన్ల పై ఎలాంటి ప్రభావం ఉండదని స్పష్టం చేసింది. ఎలాంటి ట్రాన్సాక్షన్ పై ప్రభావం చూపదని, బ్యాంక్ ట్రాన్సాక్షన్లు యదావిధిగా కొనసాగుతాయని పేర్కొంది. ఖాతాదారులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చింది. ఒకే లోన్ కేటగిరీకి ఈ బ్యాంకు బహుళ బెంచ్ మార్క్ ఉపయోగించి వడ్డీ రేట్లను నిర్ణయిస్తోన్న కారణంగానే పెనాల్టీ వేసినట్లు ఆర్‌బీఐ తెలిపింది. అలాగే అనుమతులు లేని వ్యాపారం నిర్వహించేందుకు తమ భాగస్వామ్య సంస్థను అనుమతించినట్లు పేర్కొంది. అలాగే కేవైసీ నిబంధనలు పాటించడం లోనూ విఫలమైనట్లు ఆర్‌బీఐ పేర్కొంది. ఈ మేరకు బ్యాంకింగ్ రెగ్యులేషన్ యాక్ట్ 1949 లోని సెక్షన్ 46 (4)(ఐ), సెక్షన్ 47ఏ (1)(సి) కింద ఈ మేరకు పెనాల్టీ వేసినట్లు నవంబర్ 18, 2025 రోజున ఉత్తర్వులు జారీ చేసింది. 2024, మార్చి 31వ తేదీన బ్యాంకులో తనిఖీలు నిర్వహించిన క్రమంలో ఆయా రూల్స్ అతిక్రమించినట్లు గుర్తించామని, ఈ మేరకు తమ స్పందన తెలియజేయాలని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకుకు అప్పుడే షోకాజ్ నోటీసులు పంపినట్లు తెలిపింది. అయితే బ్యాంకు స్పందన సంతృప్తికరంగా లేకపోవడంతోనే పెనాల్టీలు వేయాల్సి వచ్చినట్లు తెలిపింది.

# వెనీజులా గగనతలం మూసివేత, యుద్ధం దిశగా ట్రంప్..?




**ఇంటర్నెట్ డెస్క్:** డ్రగ్స్ అక్రమ రవాణా విషయంలో వెనీజులా పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కఠినంగా వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే కరీబియన్ సముద్రం గుండా అక్రమంగా డ్రగ్స్ ను తరలిస్తున్న పడవలు, జలాంతర్గాముల పై, అమెరికా సైన్యం దాడులకు పాల్పడింది. కరేబియన్ సముద్రంలో భారీగా అమెరికా బలగాలను మోహరించింది. సముద్ర మార్గంలో మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టలేకపోతున్నామన్న కారణంగా నేరుగా వెనీజులా భూభాగం పైనే చర్యలు తీసుకోవాలని ట్రంప్ ఇటీవల వార్నింగ్ ఇచ్చిన సంగతి తెలిసిందే. అయితే తాజాగా ఆ దేశానికి సంబంధించి మరో సంచలన ప్రకటన చేశారు ట్రంప్. మాదకద్రవ్యాల అక్రమరవాణా విషయంలో వెనీజులా పై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సీరియస్ గా ఉన్న విషయం తెలిసిందే. అయితే తాజాగా ట్రంప్ మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. వెనీజులా గగనతలం మూసివేస్తూ కీలక ప్రకటన చేశారు. ఈ మేరకు తన అధికారిక సోషల్ మీడియా మాధ్యమం అయిన ట్రూత్ సోషల్ లో పోస్టు చేశారు. అన్ని ఎయిర్ లైన్స్, పైలట్స్, డ్రగ్ డీలర్స్, మానవ అక్రమ రవాణాదారులుకు నా విజ్ఞప్తి. వెనుజులా భూ భాగం, అలాగే సరిహద్దు లోని గగనతలం మూసివేయడం జరిగింది. ఈ విషయాన్ని మీరు గ్రహించినందుకు కృతజ్ఞతలు అని ట్రంప్ పోస్టు పెట్టారు. దీంతో వెనీజులా భూభాగం పై అమెరికా దాడులకు సిద్ధం అవుతున్నట్లు స్పష్టం అవుతోంది. ఇప్పటికే కరేబియన్ సముద్రంలో అమెరికా యుద్ధ నౌకలు, జలాంతర్గాములు, ఫైటర్ జెట్‌లతో కూడిన సైనిక బలగాలను భారీగా మోహరించింది. అలాగే ఇటీవల డ్రగ్ మాఫియా పై అమెరికా జరిపిన దాడుల్లో సుమారు 80 మందికి పైగా ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. మరోవైపు వెనీజులా అధ్యక్షుడు నికోలస్ మదురోకు డ్రగ్స్ మాఫియాకు సంబంధాలు ఉన్నట్లు ట్రంప్ సర్కార్ ఆరోపిస్తుంది. ఈ క్రమం లోనే మదురో సర్కార్ రోజులు లెక్కబెట్టు కోవాలని ఇటీవల ట్రంప్ కీలక ప్రకటన చేయడంతో ఆందోళన వ్యక్తం అయింది. అయితే తాజాగా వెనీజులా పై ట్రంప్ మరో బాంబ్ పేల్చిన నేపథ్యంలో ఇక అమెరికా బలగాలు వెనీజులా పై దండెత్తే అవకాశం ఉందని అంతర్జాతీయ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ క్రమంలో వెనీజులాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకున్నాయి.

# డిసెంబర్ 1 నుంచి రానున్న 5 ప్రధాన మార్పులు ఇవే!




**ఇంటర్నెట్ డెస్క్:** రేపటితో నవంబర్ నెల ముగియనుంది. ఈ నెలాఖరుతో అనేక ముఖ్యమైన పనులకు గడువులు కూడా సమీపిస్తున్నాయి. నవంబర్ 30 వ తేదీ లోపే వాటిని పూర్తి చేయడం చాలా ముఖ్యం. కొత్త నెల ప్రారంభం కాగానే కొన్ని విషయాలలో నియమ నిబంధనలు మారుతూ ఉంటాయి. డిసెంబర్ 1 నుంచి అమలు లోకి వచ్చే ఆర్థిక నిబంధనల ప్రధాన మార్పులకు సంబంధించి పూర్తి సమాచారాన్ని ఇప్పుడు తెలుసుకుందాం..యూపీఎస్ కి డెడ్‌లైన్ :

నేషనల్ పెన్షన్ సిస్టమ్ నుంచి యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ లోకి మారేందుకు గడువు రేపటి(నవంబర్ 30)తో ముగియనుంది. ఈ గడువును మొదట సెప్టెంబర్ 30 గా నిర్ణయించారు. కానీ తరువాత నవంబర్ 30 వరకు పొడిగించారు. గడువు తేదీలోపే ఏ స్కీమ్(ఎన్పిఎస్, యుపిఎస్ డెడ్లైన్)లో చేరాలనుకుంటున్న వాళ్ళు అప్లయ్ చేసుకోవాల్సి ఉంటంది. ఇంక ఒక రోజే గడువు ఉంది. జాతీయ పెన్షన్ వ్యవస్థ (ఎన్పిఎస్) నుండి మారాలనుకునే వారు సీఆర్ఏ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు పూర్తి చేయాలి. లేదా గడువుకు ముందే సంబంధిత నోడల్ అధికారులకు అవసరమైన పత్రాలను సమర్పించాలి. పెన్షనర్ల లైఫ్ సర్టిఫికేట్ : పెన్షనర్లందరూ నవంబర్ 30 వ తేదీ లోపు తమ వార్షిక లైఫ్ సర్టిఫికేట్ సమర్పించాలి. పెన్షనర్ బతికే ఉన్నారో లేదో ప్రభుత్వం ధృవీకరించుకునేందుకు ఈ సర్టిఫికేట్ వీలు కల్పిస్తుంది. చాలా మంది ఇప్పుడు డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్ ఉపయోగిస్తున్నారు. దీనిని బ్యాంకులు, పోస్టాఫీసుల ద్వారా కూడా సమర్పించవచ్చు. సకాలంలో ధృవీకరణ పత్రం సమర్పించకపోతే మళ్ళీ సర్టిఫికేట్ సమర్పించే వరకు పెన్షన్ నిలిచిపోతుంది. టిడిఎస్ స్టేట్‌మెంట్ ఫైలింగ్: నవంబర్ 30 తేదీ నాటికి పన్ను చెల్లింపుదారులు టీడీఎస్ ఫైలింగ్ డెడ్లైన్ వివరాలను దాఖలు చేయాలి. ఇందులో అక్టోబర్‌లో చేసిన టీడీఎస్ స్టేట్‌మెంట్‌లు, సెక్షన్ 194-ఐ ఏ, సెక్షన్ 194-ఐబి, సెక్షన్ 194 ఎం, సెక్షన్ 194 ఎస్ వంటివి ఇందులో ఉన్నాయి. సెక్షన్ 92 ఈ కింద ట్రాన్స్‌ఫర్ ధరల రిపోర్టులను దాఖలు చేయాల్సిన కంపెనీలు కూడా నవంబర్ 30 వ తేదీ నాటికి ఈ ప్రక్రియను పూర్తి చేయాలి. నవంబర్ 30 వ తేదీ నాటికి ఫారమ్ 3 సిఈఏఏ ను సమర్పించాలి. ఈ గడువులను దాటితే ఆదాయపు పన్ను శాఖ నుండి జరిమానాలు లేదా నోటీసులు రావచ్చు.

## విద్యా సంస్థల వజ్రోత్సవ వేడుకలలో పెమ్మసాని





**గుంటూరు, పెన్ సత్తా, నవంబర్ 29:** గుంటూరు లోని నల్లపాడు రోడ్డులో గల స్కూల్, కాలేజ్ 60 వసంతాల వజ్రోత్సవ వేడుకల కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే బి. రామాంజనేయులు తో కలిసి గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ శనివారం పాల్గొన్నారు. కార్యక్రమంలో పెమ్మసాని మాట్లాడుతూ విద్యార్థుల తమ చిన్నతనం నుంచి ప్రేమ మానవత్వం మంచితనం అలవర్చుకోవాలన్నారు. మనకు సహాయం చేసిన వ్యక్తులను ఏ రోజు కూడా మర్చిపోకూడదు. ఏదో ఒక రోజున మనకు సహాయం చేసిన వ్యక్తులకు మనం సహాయం అందించే అవకాశం వచ్చినప్పుడు వారిని మర్చిపోకూడదన్నారు. విద్యార్థులు తమ మనసుకు నచ్చిన పనిని చేసినప్పుడు అది వర్కులా కాకుండా ఇష్టమైన అలవాటులా మారుతుంది. ఈ లయోలా స్కూల్లో చదువుకొని ఎంతోమంది విద్యార్థులు గొప్ప గొప్ప వ్యక్తులుగా ఎదిగారు. అపార్ట్మెంట్లో స్కూల్స్ నడుస్తున్న నేటి రోజుల్లో కూడా పెద్ద గ్రౌండ్, భవనాలు, విద్యార్థులకు కావలసిన పరిపూర్ణ మౌలిక సదుపాయాలు అందిస్తూ విద్యార్థులకు చదువును అందిస్తున్న స్కూల్ యాజమాన్యానికి మా అభినందనలు అని పెమ్మసాని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే రామాంజనేయులు మాట్లాడుతూ వేలాది మంది విద్యార్థులకు బోధన చేస్తూ, వారి భవిష్యత్తును తీర్చిదిద్దుతూ 60 వసంతాలు పూర్తి చేసుకున్న లయోలా పబ్లిక్ స్కూల్ నిర్వహకులకు, విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, ప్రధానోపాధ్యాయులకు మా అభినందనలు. ఒక వ్యక్తి ఊపిరి పోసుకున్న దగ్గర నుంచి ఊపిరి ఆగే వరకు మధ్య గల జీవిత ప్రయాణంలో సాధించే ఘనత లని ఒక జీవిత చరిత్రగా లిఖించుకోగలిగినప్పుడే ప్రతి విద్యార్థి తన జన్మను సార్ధకం చేసుకోగలుగుతారు. సమాజంలో ఉన్నత స్థాయికి చేరిన ప్రతి వ్యక్తి నుంచి ఒక గొప్ప పాఠం నేర్చుకునే అవకాశం ఉంటుంది. విద్యార్థులు అలాంటి సక్సెస్ స్టోరీలు చదివినప్పుడు, తెలుసుకున్నప్పుడు లేదా విన్నప్పుడు ఆయా అభ్యర్థులు పాటించిన పద్ధతులు నియమాలు ఒక జీవితాన్ని ఎంత ఉన్నత స్థాయికి తీసుకెళ్తాయనేది గమనించగలగాలి అని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో స్కూల్ యాజమాన్యం, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ ట్రావెల్స్ స్లీపర్ బస్సుల పై రాష్ట్రాలకు కీలక ఆదేశాలు!





**ఇంటర్నెట్ డెస్క్ :** దేశ వ్యాప్తంగా అనేక ప్రాంతాలలో ఇటీవల చోటు చేసుకుంటున్న బస్సు ప్రమాదాలు ప్రజలను తీవ్ర భయాందోళనలకు గురిచేస్తున్నాయి. ముఖ్యంగా ప్రైవేట్ బస్సులలో చోటు చేసుకుంటున్న దుర్ఘటనలు, బస్సులలో ప్రజల భద్రత పైన ఆందోళనకు కారణమవుతున్నాయి. ఈ క్రమంలో జాతీయ మానవ హక్కుల కమిషన్ ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వాలకు కీలక సూచనలు చేసింది. స్లీపర్ బస్సుల విషయంలో మార్గదర్శకాలను పంపించింది. ప్రైవేటు స్లీపర్ బస్సులలో ఘోర ప్రమాదాలు దూరప్రాంతాలకు వెళ్లే ప్రైవేట్ స్లీపర్ బస్సులలో ప్రయాణించిన పలువురు ఇటీవల ఘోర ప్రమాదాలలో ప్రాణాలు కోల్పోయారు. భద్రతా ప్రమాణాలు పాటించ కపోవడం, తనిఖీలు చేపట్ట కపోవడం, ఎమర్జెన్సీ డోర్స్ ను మూసివేయడం, అగ్నిమాపక పరికరాలు లేకపోవడం వంటి అనేక కారణాలతో అగ్ని ప్రమాదాలు చోటు చేసుకున్నట్టు, ఘోరంగా ప్రాణనష్టం జరిగినట్లు ఇటీవల నివేదికలు పేర్కొన్నాయి. ఫిర్యాదుల ఆధారంగా మానవ హక్కుల కమీషన్ నిర్ణయం కర్నూలు బస్సు ప్రమాదం మాత్రమే కాదు, రెండు తెలుగు రాష్ట్రాలలో ఇతర బస్సు ప్రమాదాలు, సౌదీ అరేబియాలో జరిగిన దారుణ బస్సు ప్రమాద ఘటన నేపథ్యంలో జాతీయ మానవ హక్కుల కమిషన్ దీని పై తమకు వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా ఆదేశాలను జారీ చేసింది. నిబంధనలు ఉల్లంఘించి ప్రయాణికుల ప్రాణాలను పణంగా పెడుతున్న ట్రావెల్స్ సంస్థల పైన సంయమనంతో ఉండాల్సిన అవసరం లేదని పేర్కొంది. ఆ బస్సులు నిలిపివెయ్యాలని ఉత్తర్వులు జారీ ప్రైవేట్ ట్రావెల్స్ కు షాక్ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న స్లీపర్ బస్సులను నిలిపివేయాలని అన్ని రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులకు జాతీయ మానవ హక్కుల కమిషన్ మార్గదర్శకాలను జారీ చేసింది. మరోవైపు తాజాగా ఇటీవల జరిగిన ఘటన అధికారులు తరచూ బస్సులు తనిఖీలు నిర్వహిస్తూ చర్యలు తీసుకుంటున్నారు. అయినప్పటికీ నిబంధనలు ఉల్లంఘించే వారిని ఉపేక్షించవద్దని జాతీయ మానవహక్కుల కమిషన్ ఆదేశాలు ఇవ్వడం ఇప్పుడు ప్రైవేట్ ట్రావెల్స్ యజమానులకు షాక్ అనే చెప్పాలి. ఈ బస్సులలో లోపల భాగం ఇరుగ్గా ఉండడం, ప్రయాణికులు బయటకు త్వరగా రాలేకపోవడం, అగ్ని ప్రమాదాలను నియంత్రించే రక్షణ వ్యవస్థ లేకపోవడం వంటివి కారణమవుతున్నాయి. ఇక ఈ క్రమం లోనే జాతీయ మానవ హక్కుల కమిషన్ స్లీపర్ బస్సులు విషయంలో కీలక నిర్ణయం తీసుకొని ఉత్తర్వులు జారీ చేసింది.

# అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభించిన పెమ్మసాని













**గుంటూరు, పెన్ సత్తా, నవంబర్ 29:** వట్టి చెరుకూరు మండలం లోని పలు గ్రామాల పరిధిలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలకు స్థానిక ఎమ్మెల్యే బి. రామాంజ నేయులు తో కలిసి గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ శనివారం ప్రారంభత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెమ్మసాని మాట్లాడుతూ ఊరి పేరులో తీయదనం, గుండె నిండా వ్యవసాయం, చదువు పై మమకారం పెంచుకున్న వట్టి చెరుకూరు గ్రామ ప్రజలకు, రైతులకు నా హృదయపూర్వక నమస్కారాలు అన్నారు. మండల పరిధిలో గ్రామ పెద్దలు నాయకులు ప్రజల ఆధ్వర్యంలో తీర్చిదిద్దుకున్న చెరువును చూసి చాలా ఆనందం వేసింది. అందులో ఉన్న చెరువు మట్టిని తొలగించి ఊరి బాగు కోసం ఉపయోగించు కోవడం అన్నది మరిన్ని గ్రామాలకు, మండలాలకు స్ఫూర్తి కలిగించే అంశం. 2019, 24 మధ్యలో కేంద్ర ప్రభుత్వం మన రాష్ట్రానికి రూ. 14 వేల కోట్ల రూపాయలను జలజీవన్ మిషన్ ద్వారా అందజేసింది. కానీ వైసీపీ ప్రభుత్వం ఆ నిధులను పట్టించు కోకుండా వదిలేయడం వల్ల ఆ నిధులు ఉపయోగించ కుండానే వెనక్కి వెళ్లిపోయాయి. చివరకు ఆ పథకం నిధులు వేస్ట్ అయ్యాయి అన్నారు. ఎన్నికల తరువాత కూటమి ప్రభుత్వం వచ్చాక తిరిగి ఆ పథకాన్ని తిరిగి రాష్ట్రానికి ఉపయోగపడేలా అమల్లోకి తీసుకురావడం జరిగింది.
రాష్ట్రానికి ఆదాయం పెరగడం లేదు కానీ, సంక్షేమ పథకాలకు మాత్రం ఖర్చులు తగ్గడం లేదు. దేశం లోని ఏ రాష్ట్రంలో నైనా అత్యధికంగా ఇచ్చే పెన్షన్ల విలువ రూ. 2 వేలు మాత్రమే. ఆంధ్రప్రదేశ్లో ఒక పెన్షన్ లకి ఏడాదికి రూ. 35 వేల కోట్లను ఖర్చు పెడుతున్నామన్నారు. తల్లికి వందనం, ఫ్రీ బస్సు, అన్నదాత సుఖీభవ తదితర అన్ని పథకాలకు సంబంధించి దాదాపు రూ. 65 వేల కోట్లకు పైగా నిధులను మన రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు పెడుతుంది. ఇవేగాక మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు మన కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో చేయవలసి ఉందన్నారు. ఈ అభివృద్ధి కార్యక్రమాలు అన్నింటినీ ప్రజలు గమనించాలి, దీనికి తోడు రాష్ట్రానికి భారీ పరిశ్రమలు వస్తే, పెట్టుబడుల ద్వారా రాష్ట్రానికి ఆదాయం పెరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వంలో ఇచ్చే పథకాలకుగాను 60% సెంట్రల్ ఫండ్స్ ఇస్తే, రాష్ట్ర ప్రభుత్వం నుంచి మిగిలిన 40% మ్యాచింగ్ ఫండ్ ఇవ్వాలి. అయితే ఆ మ్యాచింగ్ ఫండ్ అందజేసే విధంగా రాష్ట్రానికి ఆదాయం అంతగా లేదు. అయినా సరే రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం, రాష్ట్ర అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎక్కడ సంక్షేమ పథకాల విషయంలో వెనక్కి తగ్గడం లేదు. గుంటూరు ఛానల్ కూడా మన జిల్లాలో దాదాపు మూడు దశాబ్దాల కల, దాదాపు 11 మండలాలకు పైగా ఉపయోగపడే ఈ గుంటూరు ఛానల్ పనులను త్వరలోనే మొదలుపెడతామని భరోసా ఇస్తున్నాము. మన ప్రాంత ప్రజల కోసం, ప్రాంత అభివృద్ధి కోసం నేను ఇక్కడున్న, ఎక్కడన్నా, ఢిల్లీలో ఉన్నా సరే, కృషి చేస్తూనే ఉంటానని స్పష్టం చేస్తున్నాను అని పెమ్మసాని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే రామాంజ నేయులు మాట్లాడుతూ వట్టి చెరుకూరు మండలంలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను వరుసగా కల్పిస్తున్నాం. ప్రజల కోరిన విధంగా ప్రముఖ ప్రాంతాలలో కావాల్సిన సి.సి రోడ్లు, డ్రైన్లు, కల్వర్టులు, షెడ్డులు నిర్మిస్తున్నాము. రాబోయే స్థానిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి అఖండ విజయం అందజేయాలని కోరుతున్నాం అన్నారు. కార్యక్రమం అనంతరం వట్టి చెరుకూరు మండల పరిధి లోని అర్హులైన వారికి ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ కింద సిఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే రామాంజ నేయులు, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని కలిసి అర్హులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఉత్తమ సేవలు అందించిన పోలీసులకు పురస్కారాలు





**విశాఖపట్నం, పెన్ సత్తా, నవంబర్ 29**: సిబ్బంది సంక్షేమంతో పాటుగా వారు అందించిన సేవల యందు ప్రతిభను గుర్తిస్తూ, ఉన్నతాధికారుల సమక్షంలో 209 మందికి రివార్డులను అందజేసిన నగర పోలీసు కమీషనర్. శనివారం నగర పోలీసు కమీషనర్ డా.శంఖబ్రత బాగ్చి క్రైమ్ రివ్యూ మీటింగ్ నందు గత నెల ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బంది సేవలను ప్రోత్సహిస్తూ 209 మందికి రివార్డ్ మంజూరు ఆర్డరును అందజేయడం జరిగినది. నగర పోలీసు శాఖ నందు హెూంగార్డు నుండి సిఐ స్థాయి అధికారుల వరకూ వారు నిర్వహిస్తున్న విధులకు తగ్గా గుర్తింపు ఇస్తూ, ప్రతి నెలా ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి తగు రివార్డులు అందజేసి, వారు సమర్ధవంతముగా విధులు నిర్వహిస్తూ తోటి సిబ్బందికి ప్రేరణ ఇస్తూ అభివృద్ధి చెందుతున్న విశాఖ నగరం మరింత సురక్షితముగా ఉండే దిశగా సిపి చర్యలు తీసుకున్న విషయం విధితమే. గంజాయి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తూ నగరం గుండా రవాణా అవుతున్న గంజాయిని సీజ్ చేసిన పలు కేసులలో, చోరీ కాబడిన సొత్తు, ఇతర వస్తువులను రికవరీ చేసి, నిందితులను అరెస్టు చేసిన పలు కేసులలో, సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి పేరుమోసిన నేరస్తులను అరెస్టు చేయడంలో ముఖ్యపాత్ర పోషించిన కేసులో, సైబర్ క్రైమ్ కేసులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 209 మంది, హెూం గార్డు నుండి సీ.ఐ వరకూ గల సిబ్బందికి రివార్డులు మంజూరు చేసి, సిబ్బంది అందరూ ప్రేరణ చెంది మరింత మెరుగ్గా విధులు నిర్వర్తించేలా క్రైమ్ మీటింగ్ కు నందు నగర పోలీసు ఉన్నతాధికారుల సమక్షంలో రివార్డు మంజూరు ఆర్డరును ఇవ్వడం జరిగినది.
స్వయంగా సిపి తమ ప్రతిభను గుర్తించి, ఉన్నతాధికారుల సమక్షంలో ఈ రివార్డులు అందజేయడం పట్ల సిబ్బంది అందరూ విధులు మరింత సమర్ధవంతముగా నిర్వహించడానికి ఇది ఎంతో ప్రేరణగా ఉందని తెలుపుతూ సిపి డా.శంఖబ్రత బాగ్చి కి తమ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

# మెగా ఉద్యోగ మేళా లో నియామక పత్రాలు అందజేసిన యార్లగడ్డ








**గన్నవరం, పెన్ సత్తా, నవంబర్ 29:** కృష్ణా, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల డిడియు%-%జీకేవై శిక్షణార్థులకు ఉపాధి అవకాశాలను అందించేందుకు రాష్ట్ర సీడప్, కంచర్ల ఫౌండేషన్ సంయుక్తంగా శనివారం గన్నవరం మండలం సూరంపల్లి లోని పాలడుగు పార్వతీదేవి ఇంజినీరింగ్ కళాశాలలో మెగా ప్లేస్ మెంట్ డ్రైవ్ ను నిర్వహించింది. కార్యక్రమానికి విద్యార్థులు, శిక్షకులు, కంపెనీ ప్రతినిధులు విస్తృతంగా హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే యర్లగడ్డ వెంకటరావు, ప్రాజెక్ట్ డైరెక్టర్ హరిహరనాథ్, జేడిఎం సుమలత ప్రారంభించారు. డ్రైవ్లో దేశవ్యాప్తంగా పని చేస్తున్న 10 ప్రముఖ కంపెనీలు పాల్గొనగా, మూడు జిల్లాల నుంచి వచ్చిన 300 మందికి పైగా అభ్యర్థులు ఇంటర్వ్యూల్లో పాల్గొన్నారు. ఉదయం నిర్వహించిన రిక్రూట్ మెంట్ ప్రక్రియ తర్వాత సాయంత్రం ఎంపికైన విద్యార్థులకు కంపెనీలు ఆఫర్ లెటర్లు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్యే యర్లగడ్డ వెంకటరావు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం యువత ఉపాధి విస్తరణకు అత్యంత ప్రాముఖ్యత ఇస్తోంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి, కట్టుదిట్టమైన ప్రణాళికల వల్ల రాష్ట్రంలో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు వేగంగా ముందుకు సాగుతున్నాయి. స్కిల్ ట్రైనింగ్ నుంచి ప్లేస్మెంట్ వరకు ప్రతి దశను ప్రభుత్వం పర్యవేక్షిస్తోంది. గ్రామీణ యువతకు నాణ్యమైన శిక్షణ అందించి, పరిశ్రమలతో నేరుగా కలిపే కార్యక్రమాల్లో సీడప్ కీలక భూమిక వహిస్తోంది. ఈ మెగా ప్లేస్మెంట్ డ్రైవ్ ప్రభుత్వం యువత భవిష్యత్ పై చూపిస్తున్న నిబద్ధతకు స్పష్టమైన నిదర్శనం అన్నారు. డ్రైవ్ను అత్యంత ప్రణాళికాబద్ధంగా, పారదర్శకంగా నిర్వహించామని సీడప్, కంచర్ల ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. కంపెనీల స్పందన, విద్యార్థుల ఉత్సాహం, నిర్వాహకుల సమన్వయంఅన్ని కలిసి డ్రైవ్ను విజయవంతం చేశాయని పేర్కొన్నారు. విజయవాడలో నిర్వహించిన ఈ మెగా ప్లేస్మెంట్ డ్రైవ్ గ్రామీణ యువతకు ఉపాధి అవకాశాల దిశగా కొత్త అవకాశాలను తెరిచింది.

# స్టీల్ ప్లాంట్ నిర్మాణ పనులలో స్థానికులకే అవకాశం ఇవ్వాలి



వైయస్సార్సీపి రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ డిమాండ్

**నక్కపల్లి, పెన్ సత్తా, నవంబర్ 29 :** అనకాపల్లి జిల్లా, నక్కపల్లి మండలం లో ఏర్పాటు కాబోతున్న అర్సిలాల్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ప్లాంట్ నిర్మాణపు పనులలో స్థానికులకే అవకాశం ఇవ్వాలని వైయస్సార్సీపి రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక వైయస్సార్ సిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్ కోసం ఏర్పాటుచేసిన ప్రజాభిప్రాయ సేకరణలో జిల్లా అధికారులు, స్టీల్ ప్లాంట్ యాజమాన్యం, ప్రభుత్వ పెద్దలు, స్టీల్ ప్లాంట్ నిర్వాసితులకు అనేక హామీలు ఇచ్చారన్నారు. స్టీల్ ప్లాంట్లో భూములు కోల్పోయిన అమలాపురం, పాటిమీద, మూలపర, తమ్మయ్య పేట, తుమ్మల పేట, చందనాడ తదితర గ్రామాల ప్రజలకు స్టీల్ ప్లాంట్ పరిశ్రమ వల్ల ఈ ప్రాంత ప్రజలు అభివృద్ధి చెందుతారని, ప్రతి ఒక్కరికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పడంతో స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు అంగీకరించారన్నారు. ప్రస్తుతం స్టీల్ ప్లాంట్ యాజమాన్యం భూములు ఇచ్చిన రైతులను మోసం చేస్తుందన్నారు. భూ సేకరణ చట్ట ప్రకారం భూములు కోల్పోయిన రైతులకు పూర్తిస్థాయి పరిహారం, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజ్ చెల్లించకుండా పనులు ప్రారంభించడం సరైనది కాదన్నారు. 18 ఏళ్లు నిండిన ఆడపిల్లలకు కూడా ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ చెల్లించవలసిందేనని వీసం రామకృష్ణ డిమాండ్ చేశారు. ప్రస్తుతం స్టీల్ ప్లాంట్ యాజమాన్యం, కూటమి ప్రభుత్వం భూములు కోల్పోయిన రైతులకు, కార్మికులకు, వ్యవసాయ కూలీలకు అన్యాయం చేస్తోందని ఆరోపించారు. ఈ ప్రాంత ప్రజలకు కాకుండా స్టీల్ ప్లాంట్ నిర్మాణ పనులను ఇతర ప్రాంతాల వారికి అప్పజెప్పాలని చూడడం అన్యాయం అన్నారు. ఎక్కడో హైదరాబాద్ లో ఉండి టెండర్లు వేయడం విరమించుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలోవైస్ ఎంపీపీ వెలగా ఈశ్వరరావు, పొడగట్ల పాపారావు, సూరకాసుల గోవిందు, తల్లా భార్గవ్, తిరుపతిరావు తదితరులు ఉన్నారు.

# థాయిలాండ్ సదస్సుకు సాంకేతిక విద్యాపరిషత్ కు ఆహ్వానం



**విశాఖపట్నం, పెన్ సత్తా, నవంబర్ 29:** యుఎన్ ఎస్డిజి ఫోరమ్ 2025, థాయిలాండ్ సదస్సుకు సాంకేతిక విద్యాపరిషత్ ఇంజనీరింగ్ కళాశాలకు ఆహ్వానం. మధురవాడ లోని సాంకేతిక విద్యాపరిషత్ ఇంజనీరింగ్ కాలేజ్‌కు చెందిన ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ (ఈసిఈ) విభాగం విభాగాధిపతి యుఎన్ ఎస్డిజి ఫోరమ్ 2025 ఇంటర్నేషనల్ సదస్సుకు భారత దేశం నుండి ప్రతినిధిగా డాక్టర్ రేగిడి సునీత కు ఆహ్వానం లభించింది.

ఈ కార్యక్రమంలో స్థిర అభివృద్ధి లక్ష్యాల పై వివిధ ప్రజెంటేషన్ లు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, పర్యావరణ పరిరక్షణ, సస్టైనబుల్ డెవలప్మెంట్ పై తమ నిబద్ధతను చూపించారు. తమ విభాగాధిపతి ఇలాంటి అంతర్జాతీయ వేదికను అలంకరించడం ఆనందంగా ఉందని ఆళ్వార్ దాస్ గ్రూప్ సెక్రటరీ, కరెస్పాండంట్ డాక్టర్. ఎస్. వి. హెచ్. రాజేంద్ర, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సుంకరి రాహుల్ ఆళ్వార్ దాస్, సాంకేతిక టెక్నికల్ క్యాంపస్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మధు భాట్, అకడమిక్ డైరెక్టర్ వి. శివరాం ప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్. డాక్టర్. కే. శ్రీ రామ కృష్ణ తెలియజేసారు.

# నానో యూరియా ప్రదర్శన కేత్రాన్ని పరిశీలించిన అప్పలస్వామి





**మునగపాక, పెన్ సత్తా, నవంబర్ 29:** మండలం, మునగపాక గ్రామంలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ ) వ్యవసాయ శాఖ నానో యూరియా ప్రదర్శన కేత్రమూ జీవన ఎరువులు ప్రదర్శన కేస్త్రం పరిశీలించడానికి గాను ఆత్మ పథక సంచాలకులు (పీడీ) అప్పలస్వామి విశాఖపట్నం, మునంపాక మండలం, వాడ్రపల్లి గ్రామంలో నానో యూరియా ప్రదర్శన క్షేత్రము పరిశీలించారు. ఆయన రైతులతో మాట్లాడుతూ నానో యూరియా స్ప్రే చేయడం ఉపయోగాలు గురించి రైతులకు తెలిపారు. ఒక ఎకరాకు 500 ఎంఎల్ చొప్పున నానో యూరియా స్ప్రే చేసుకోవాలని తెలిపారు. అదేవిధంగా రైతులు ఈ నానో యూరియా స్ప్రే చేసుకోవడం వలన వరి పొలం పైరు పచ్చగా ఉంటుందని తెలిపారు, ఈ నానో యూరియా స్ప్రే చేయడం వలన వరి పొలం వేపుగా పెరుగుతుందని ఈ నానో యూరియా 500 ఎంఎల్ ఖరీదు 225 రూపాయలని తెలిపారు. ఈ నానో యూరియా ని అన్ని రకాల పంటలకు వాడు కోవచ్చని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ నానో యూరియా ప్రదర్శన కెత్రం వాడ్రాపల్లి గ్రామంలో మల్ల శేషు రైతుని ఎంపిక చేసి ఈ నానో యూరియా స్ప్రే చేయించడం జరిగిందని తెలిపారు. మల్ల శేషనే రైతు ఈ నానో యూరియా బాగా పనిచేస్తుందని ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆత్మ కి తెలిపారు. నానో యూరియా పశు గ్రాసం గడ్డి కి స్ప్రే చేయడం వలన గడ్డి పచ్చగా వేపుగా పెరుగుతుందని ఈ సందర్భంగా తెలియజేశారు. అదే విధంగా చూచుకొండ గ్రామంలో జీవన ఎరువులు ప్రదర్శన క్షేత్రం ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ అప్పలస్వామి పరిశీలించడం జరిగింది. అప్పలస్వామి మాట్లాడుతూ జీవన ఎరువులు ప్రదర్శన క్షేత్రం యొక్క ఉపయోగాలు గురించి రైతులకు వివరించారు. ఈ జీవన ఎరువులు అయినటువంటి, అజిటో బ్యాక్టీరియా, పాస్ప బ్యాక్టీరియా, అజో స్పెరిలం ఒంటి జీవన ఎరువులు వాడడం వలన భూమి సారం పెరుగుతుందని, ఈ ప్రదర్శన క్షేత్రం యొక్క ముఖ్య ఉద్దేశం అని చూచుకొండ రైతులకు తెలిపారు. ఈ జీవన ప్రదర్శన క్షేత్ర%శీ% రైతు అయినటువంటి పెంటకోట శివ మాట్లాడుతూ ఈ జీవన ఎరువులు పశువులు గతంలో కలిపి వెయ్యడము వలన పంట వేపుగా పచ్చగా పెరిగిందని రైతు చాలా సంతోషంగా తెలిపారు. పతి రైతు కూడా జీవన ఎరువులు అయినటువంటి కేఆర్బి, పిఎస్బి వంటి జీవన ఎరువులుని వాడాలని ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ అప్పలస్వామి రైతులకు వివరించారు. ఒక ఎకరాకు 500 ఎంఎల్ చొప్పున పొడిగత్తంలో కలుపుకొని పొలంలో జల్లు కావాలని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జోష్ణ కుమారి, ఆత్మ ఏటీఎం పి.రామకృష్ణ, రైతులు వాడ్రాపల్లి మల్ల శేషు, చూచుకొండ గ్రామం రైతు లు పెంటకోటి శివ, పెంటకోట హరే రామ్ రైతులు పాల్గొన్నారు.

# ఇంటి స్థలం విషయంలో కూటమి నాయకులు తప్పుడు ప్రచారం





**పరవాడ, పెన్ సత్తా, నవంబర్ 29:** మండలం లోని తాణాం గ్రామ సచివాలయంలో ఇల్లు లేని పేద ప్రజలకు ఇంటి స్థలం విషయంలో తప్పుడు హామీలతో కూటమి నాయకులు ప్రచారం చేస్తున్నారని జడ్పీటీసీ పయిల సన్యాసి రాజు ఆరోపించారు. శనివారం సచివాలయంలో ఇల్లు పట్టాలు కి అప్లికేషన్ తీసుకోవడం గురించి వివరాల విషయంలో లబ్దిదారులకు రాజు అవగాహన కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా రాజు లబ్ధిదారులతో మాట్లాడుతూ

ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా, ఎవరైతే సొంత స్థలంలో ఇల్లు కట్టుకుంటారో వారికి కేంద్ర ప్రభుత్వం సాయంగా 1,59,000 మంజూరు చేస్తారన్నారు. దానికి రాష్ట్ర ప్రభుత్వం గ్రామంలో ఎంత మంది సొంత స్థలాల్లో ఇల్లు కట్టు కుంటారో గ్రామంలో సర్వే నిర్వహించి, ఈ పథకం ఎంత మందికి కావాలో, ఎంతమంది అర్హులు ఉన్నారో తెలుసుకుని, కేంద్ర ప్రభుత్వానికి డిమాండ్ పెట్టడం, తద్వారా ఇల్లు కట్టుకునే మూడు స్టేజిలో 1,59,000 విడుదల అవుతాయి అని తెలియజేసారు. తాణాం గ్రామంలో, పరవాడ పరిసర గ్రామాలలో, ఇల్లు స్థలాల కోసం అప్లికేషన్లు తీసుకుంటున్నారు, ఇప్పటి కొచ్చి ఇల్లు స్థలాల గురించి ప్రభుత్వం ఎటువంటి మార్గదర్శికాలు విడుదల చేయలేదు.

ఇప్పుడు ఏదైతే గ్రామ సచివాలయంలో చేస్తున్నారో ఇది కేవలం ఇల్లు కావాల్సిన వారి డిమాండ్ సర్వే మాత్రమే అని తెలిపారు. ఇప్పుడు తీసుకుంటున్న అప్లికేషన్స్ ప్రభుత్వం రాష్ట్రంలో ఎంతమంది ఉన్నారో తెలుసుకునేందుకు చేస్తున్న కార్యక్రమం అన్నారు. గత ప్రభుత్వంలో ఈ సర్వేని గ్రామ సచివాలయం వాలంటరీ ద్వారా సర్వే చేసేవాళ్లు, ఇప్పుడు మనమే గ్రామ సచివాలయానికి వెళ్లి సర్వే చేయించు కోవాలి అని రాజు అన్నారు. ఈ రోజు వరకు ఏ ప్రధాన పేపర్లో కూడా ఇల్లు స్థలాల గురించి రాలేదని, కేవలం పీఎంఏవై ఇంటి నిర్మాణం వరకే వస్తున్నాయి ఇది గ్రామస్తులు గమనించగలరు అని సన్యాసి రాజు తెలిపారు.

# ప్రజా దర్బార్ నిర్వహించిన పరిటాల శ్రీరామ్

- సీసీ రోడ్లు, డ్రైనేజి కాలువలు, వీధిలైట్లు కావాలని అర్జీలు అందించిన ప్రజలు.
- అధికంగా కరెంటు సమస్యల పై ఫిర్యాదు చేసిన ప్రజలు.







**ధర్మవరం, పెన్ సత్తా, నవంబర్ 29:** పట్టణం ఎర్రగుంట సర్కిల్ లో గల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ధర్మవరం నియోజకవర్గ తెదేపా ఇంచార్జ్ పరిటాల శ్రీరామ్ ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయం వద్దకు పెద్ద ఎత్తున వినతులు అందించడానికి ప్రజలు హాజరయ్యారు. ముఖ్యంగా ధర్మవరం పట్టణంలో గల 40 వార్డులలో సిసి రోడ్లు, సిసి డ్రైన్లు నిర్మించాలని వార్డు ప్రజలు పరిటాల శ్రీరామ్ కి వినతులు అందజేశారు. అదేవిధంగా పట్టణంలో చెత్త సేకరణ జరగడంలేదని చెత్త సేకరణ చేసే ఆటోలు, ట్రాక్టర్లు చెత్త కలెక్షన్ కు తిరగడం లేదని మురికి కాలువలను 15 రోజులకు ఒకసారి కూడా శుభ్రపరచడం లేదని పరిటాల శ్రీరామ్ దృష్టికి పట్టణ వార్డులలో గల ప్రజలు ఫిర్యాదు చేశారు. అదేవిధంగా పట్టణంలో లో-వోల్టేజ్ సమస్య అధికంగా ఉందని విద్యుత్ హెచ్చుతగ్గులతో పలు వార్డులలో కరెంటు గృహోపకరణాలు కాలిపోతున్నాయని పరిటాల శ్రీరామ్ దృష్టికి ప్రజలు తీసుకొచ్చారు. పట్టణంలో గల వార్డులలో ఇనుప కరెంటు స్తంభాలు అధికంగా ఉన్నాయని వర్షం వచ్చినప్పుడు ఇనుప స్తంభాలకు కరెంటు షాక్ వస్తుందని తక్షణమే ఇనుప పోల్స్ స్థానంలో సిమెంట్ పోల్స్ వేయాలని ప్రజలు పరిటాల శ్రీరామ్ కు విన్నవించారు. ధర్మవరం పట్టణంలో గల పలు వార్డులలో నివాస గృహాలపై కరెంటు వైర్లు ఉన్నాయని వాటిని సరిచేయాలని వార్డు ప్రజలు కోరారు. ప్రజా దర్బార్ కు హాజరైన ఎలక్ట్రిసిటీ ఏ.డి, ఏ.ఇ లతో మాట్లాడిన పరిటాల శ్రీరామ్ కరెంటు సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను కోరారు. అన్ని సమస్యలపై అర్జీలు తీసుకున్న పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ సమస్యలన్నింటినీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లడం జరుగుతుందని, వాటిని పరిష్కరించే విధంగా కృషి చేస్తామని అదేవిధంగా ఈ సమస్యల అన్నింటిని వార్డు నాయకులకు తెలియజేసి అధికారులను వెంబడి తీసుకుని వెళ్లి సమస్యలను పరిష్కరించే విధంగా ముందుకు వెళ్తామని పరిటాల శ్రీరామ్ ఫిర్యాదులు అందజేసిన ప్రజలందరికీ తెలియజేశారు. ప్రజా దర్బార్ కార్యక్రమానికి ఎలక్ట్రిసిటీ ఏడి మరియు ఏఈ లతోపాటు తెదేపా ముఖ్య నాయకులు హాజరయ్యారు.

# పకృతి వ్యవసాయం ప్రదర్శన క్షేత్ర పరిశీలన







**అనకాపల్లి, పెన్ సత్తా, నవంబర్ 29:** మండలం, తుమ్మపాల గ్రామంలో, దిబ్బపాలెం గ్రామంలో నానో యూరియా, పకృతి వ్యవసాయం ప్రదర్శన క్షేత్ర పరిశీలన వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ( ఆత్మ ) వ్యవసాయ శాఖ నానో యూరియా ప్రదర్శన కేత్రమూ, పకృతి వ్యవసాయం ప్రదర్శన క్షేత్రం పరిశీలించడానికి గాను ఆత్మ పథక సంచాలకులు (పీడ) అప్పలస్వామి విశాఖపట్నం, అనకాపల్లి మండలం, తుమ్మ పాలెం గ్రామంలో నానో యూరియా ప్రదర్శన క్షేత్రము పరిశీలించారు. ఆయన రైతులతో మాట్లాడుతూ నానో యూరియా స్ప్రే చేయడం ఉపయోగాలు గురించి రైతులకు తెలిపారు. ఒక ఎకరాకు 500 ఎంఎల్ చొప్పున నానో యూరియా స్ప్రే చేసుకోవాలని తెలిపారు. అదేవిధంగా రైతులు ఈ నానో యూరియా స్ప్రే చేసుకోవడం వలన వరి పొలం పైరు పచ్చగా ఉంటుందని తెలిపారు. ఈ నానో యూరియా స్ప్రే చేయడం వలన వరి పొలం వేపుగా పెరుగుతుందని ఈ నానో యూరియా 500 ఎంఎల్ ఖరీదు 225 రూపాయలని తెలిపారు, ఈ నానో యూరియా ని అన్ని రకాల పంటలకు వాడుకోవచ్చని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ నానో యూరియా ప్రదర్శన కెత్రం తుమ్మపాల గ్రామంలో గొర్ల మోదు నాయుడు రైతుని ఎంపిక చేసి ఈ నానో యూరియా స్ప్రే చేయించడం జరిగిందని తెలిపారు. గొర్రెల శ్యామ్ రైతు ఈ నానో యూరియా బాగా పనిచేస్తుందని ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆత్మ కి తెలిపారు. నానో యూరియా పశుగ్రాసం, గడ్డి కి స్ప్రే చేయడం వలన గడ్డి పచ్చగా వేపుగా పెరుగుతుందని ఈ సందర్భంగా తెలియజేశారు. అదే విధంగా దిబ్బపాలెం గ్రామంలో ప్రకృతి వ్యవసాయ ప్రదర్శన క్షేత్రం ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ అప్పలస్వామి పరిశీలించడం జరిగింది. అప్పలస్వామి మాట్లాడుతూ ఈ పకృతి వ్యవసాయ పద్ధతుల గురించి రైతులకు తెలిపారు. ఈ పకృతి వ్యవసాయ ప్రదర్శన క్షేత్రం యొక్క ఉపయోగాలు గురించి రైతులకు వివరించారు. ఈ పకృతి వ్యవసాయ కషాయాలు, గణ, ద్రవ జీవ అమృతాలు, పచ్చిరొట్ట ఎరువులు, పిఎండిఎస్ విత్తనాలు వాడడం వలన భూమి సారం పెరుగుతుందని ఈ ప్రదర్శన క్షేత్రం యొక్క ముఖ్య ఉద్దేశం అని దిబ్బ పాలెం రైతులకు తెలిపారు. ప్రకృతి వ్యవసాయప్రదర్శన క్షేత్ర%శీ% రైతు అయినటువంటి యల్లపు అప్పల నర్సమ్మ మాట్లాడుతూ ఈ ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించడంలో చాలా ఉపయోగాలు ఉన్నాయని, ఘన ద్రవ జీవ అమృతాలు, పశువులు గతంలో కలిపి వెయ్యడము వలన పంట వేపుగా పచ్చగా పెరిగిందని రైతు చాలా సంతోషంగా తెలిపారు. ఈ కార్యక్రమ లో ఆత్మ ఏటీఎం పి.రామకృష్ణ, రైతులు దెబ్బపాలెం ఎల్లప్ప నరసింహ, తమ పాల గ్రామ రైతులు, గొర్ల శ్యామ్ రైతులు పాల్గొన్నారు.

## మరో 20 వేల ఎకరాలకు భూ సేకరణ

: అమరావతిని అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దేందుకు రెండో దశ భూసేకరణ తప్పదని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేసిన విషయం తెలిసిందే. పెట్టుబడులు, ఎయిర్‌పోర్టు, స్పోర్ట్స్‌సిటీ వంటి వాటికి భూములు అవసరమని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం జరిగిన కేబినెట్ సమావేశంలో రెండో దశ భూసేకరణకు సంబంధించి చర్చించారు. 7 గ్రామాల పరిధిలో మరో 16,666 ఎకరాల భూసమీకరణకు సీఆర్డీఏకు అనుమతి ఇచ్చింది రాష్ట్ర మంత్రివర్గం. ప్రభుత్వ భూమితో కలిపి మొత్తంగా 20 వేల ఎకరాలు సేకరించాలని మంత్రివర్గం నిర్ణయించినట్లు సమాచారం. ఈ మేరకు ల్యాండ్ పూలింగ్ చేపట్టే గ్రామాలను మంత్రివర్గం పరిశీలించినట్లు తెలుస్తోంది.ఆంధ్రప్రదేశ్ కలల రాజధాని అమరావతిని అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దడానికి రెండోదశ భూసమీకరణ తప్పదని ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం (నవంబర్ 27) అన్నారు. రాజధానిలో పెట్టుబడులు పెట్టేందుకు వస్తున్న సంస్థలకు భూములు లేవని చెప్పారు. అంతర్జాతీయ ప్రమాణాలతో ఎయిర్‌పోర్టు, స్పోర్ట్స్‌సిటీ, రైల్వేస్టేషన్ నిర్మించేందుకు కూడా భూములు అవసరమని చెప్పారు. ఇవన్నీ వస్తేనే అమరావతి ప్రపంచస్థాయి నగరంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ నేపథ్యంలో రెండో దశ భూసేకరణ చేయడానికి రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకున్నట్లు తీసుకుంది. 7 గ్రామాల పరిధిలో మరో 16,666 ఎకరాల భూసమీకరణకు సీఆర్డీఏకు అనుమతి ఇచ్చే ప్రతిపాదనలకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. ప్రభుత్వ భూమితో కలిపి రెండో దశలో 20 వేల ఎకరాల భూమిని సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సమాచారం. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో భూసేకరణతో పాటు దాదాపు 25కుపైగా అజెండా అంశాలపై చర్చించారు.ఈ కేబినెట్ సమావేశంలో భూసేకరణ చేయబోయే ప్రాంతాలను పరిశీలించినట్లు సమాచారం. హరిశ్చంద్రపురం, వైకుంఠపురం, ఎంద్రాయి, కర్లపూడి, వడ్డమాను, పెదమద్దూరు, పెదపరిమి వంటి ప్రాంతాలను పరిశీలించినట్లు తెలుస్తోంది. ఆయా గ్రామాల్లో భూ లభ్యత, రికార్డులు, యాజమాన్యం, అభ్యంతరాలు వంటి అంశాలపై అధికారులు నివేదికలు సమర్పించినట్లు చెబుతున్నారు. వైకుంఠపురంలో 3,361 ఎకరాలు, పెదమద్దూరులో 1,145 ఎకరాలు, కర్లపూడిలో 2,944 ఎకరాలు, హరిశ్చంద్రపురంలో 2,418 ఎకరాలు , వడ్డమానులో 1,913 ఎకరాలు, పెదపరిమిలో 6,513 ఎకరాలు, ఎంద్రాయిలో 2,166 ఎకరాలు సేకరించాలనుకుంటున్నట్లు తెలుస్తోంది.రైతుల వద్ద నుంచి సేకరించిన భూమితో పాటు ప్రభుత్వ భూమి, అసైన్డ్ భూములతో కలిపి మొత్తం 20,494 ఎకరాలు సేకరించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోందని సమాచారం. త్వరలో రెండో విడత ల్యాండ్ పూలింగ్ నోటిఫికేషన్ విడుదల కానున్నట్లు తెలుస్తోంది. కాగా, ఇప్పటికే అమరావతి నిర్మాణానికి మొదటి విడతలో రైతుల నుంచి 34,000 ఎకరాలు సమీకరించారు. ఇప్పుడు రెండో విడతకు సిద్ధమవుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. వీటికి అదనంగా 16,000 ఎకరాల ప్రభుత్వ భూమిని ప్రభుత్వం సీఆర్డీఏకు అప్పగించనున్నట్లు తెలుస్తోంది. అంటే.. ఆంధ్రప్రదేశ్ రాజధాని నిర్మాణానికి మొత్తం దాదాపు 70,0 00 ఎకరాల భూమి సిద్ధమవుతోందన్నమాట.కాగా, రాజధాని రైతులతో గురువారం సచివాలంలో సమావేశమయ్యారు ముఖ్యమంత్రి చంద్రబాబు. రెండున్నర గంటల పాటు సాగిన మీటింగ్‌లో రాజధాని అభివృద్ధికి రైతులు సహకరించాలని కోరారు. రైతులు సహకరించకపోతే.. అమరావతి ఒక మున్సిపాలిటీగా మిగిలిపోతుందని అన్నారు. ప్రతి చిన్న విషయానికి సోషల్ మీడియాకు ఎక్కి రచ్చ చేయొద్దని, అంతర్గత విభేదాలతో సమస్యను పెద్దది చేయొద్దని సున్నితంగా హెచ్చరించారు. అమరావతి రైతుల్లో జేఏసీలు ఎక్కువగా ఉన్నాయని.. అందులో ఐకమత్యం లేదన్నారు. అందరూ ఒకేతాటిపై నిలబడి అమరావతి అభివృద్ధి కమిటీగా ఏర్పడాలని చంద్రబాబు సూచించారు.


## ఆ మూడు ఆస్పత్రులకు మంచి రోజులు

ప్రజారోగ్యం, ఆసుపత్రుల అభివృద్ధిపై ఏపీ ప్రభుత్వం దృష్టి పెట్టింది. అందులో భాగంగా మూడు ఏరియా ఆస్పత్రుల అభివృద్ధికి నిధులు కేటాయించింది. పిఠాపురం, మంగళగిరి, చిలకలూరిపేట ఏరియా ఆస్పత్రుల అభివృద్ధికి నిధులు కేటాయిస్తూ ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకోసం ఏపీ డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ విభాగానికి 22 కోట్ల 74 లక్షల రూపాయలు అదనపు నిధులు కేటాయించారు. ఆంధ్రప్రదేశ్ వైద్యారోగ్య శాఖ కార్యదర్శి నుంచి దీనికి సంబంధించిన ఉత్తర్వులు విడుదల అయ్యాయి.ప్రజారోగ్యంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దృష్టి సారించింది. ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం కీలక చర్యలు చేపడుతోంది. అందులో భాగంగా ప్రభుత్వ ఆస్పత్రులలో మౌలిక వసతుల కల్పన, అధునాతన వైద్య చికిత్సలు అందుబాటులోకి తెచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే మూడు నియోజకవర్గాలకు ఏపీ ప్రభుత్వం శుభవార్త వినిపించింది. రాష్ట్రంలోని మూడు ఏరియా ఆస్పత్రులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిధులు కేటాయించింది. డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ విభాగానికి ఏపీ ప్రభుత్వం ఈ మేరకు రూ.22.74 కోట్లు అదనపు నిధులు కేటాయించింది. మంగళగిరి. పిఠాపురం ఏరియా ఆస్పత్రి , చిలకలూరిపేట ఏరియా ఆస్పత్రుల అభివృద్ధి కోసం ఈ నిధులను ఖర్చు చేయనున్నారు. ఈ మేరకు ఏపీ వైద్యారోగ్య శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్ ఉత్తర్వులు జారీ చేశారు.మరోవైపు మంగళగిరి ఏరియా ఆస్పత్రి సామర్థ్యం ప్రస్తుతం 30 పడకలు మాత్రమే. ప్రజా అవసరాల నేపథ్యంలో ఈ ఆస్పత్రిని అభివృద్ధి చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇటీవల నిర్ణయం తీసుకుంది. మంగళగిరి ఏరియా ఆస్పత్రిని100 పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేయాలని.. ఈ ఆస్పత్రికి అదనంగా 73 పోస్టులు కేటాయించాలని నిర్ణయించారు. ఆ నిర్ణయానికి అనుగుణంగా అదనపు పడకలు, అదనపు పోస్టుల కోసం రూ.52.20 కోట్లు కూడా కేటాయించారు. అలాగే మంగళగిరి ఏరియా ఆస్పత్రిని చినకాకాని వద్ద ఉన్న వైవీసీ క్యాన్సర్ ఆసుపత్రి స్థలంలో నిర్మించాలని నిర్ణయిస్తూ ఉత్తర్వులు కూడా జారీ చేశారు. ప్రస్తుతం ఉన్న ఆస్పత్రి భవనం పాడవటంతో ఈ నిర్ణయం తీసుకున్నారు.మరోవైపు మంత్రి నారా లోకేష్ మంగళగిరి ఏరియా ఆస్పత్రి నిర్మాణంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఈ ఆస్పత్రిని కార్పొరేట్ వసతులతో నిర్మించాలని.. అత్యాధునిక వైద్య సౌకర్యాలు అందుబాటులోకి తేవాలని అధికారులకు ఇప్పటికే సూచనలు చేశారు. మంగళగిరి ఏరియా ఆస్పత్రిని గ్రౌండ్ ఫ్లోర్, ఫస్ట్ ఫ్లోర్.. రెండు అంతస్తులో నిర్మిస్తున్నారు.రోగులకు ఉపయోగపడేలా ఆస్పత్రిలో లిఫ్ట్ ఏర్పాటు చేయనున్నారు. విశాలమైన పార్కింగ్ స్థలం కేటాయించనున్నారు. ఈ ఏరియా ఆస్పత్రికి మంగళగిరి నియోజకవర్గం నలుమూలల నుంచి చికిత్స కోసం ప్రజలు వచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో రోగులతో పాటుగా వారి బంధువుల కూడా అసౌకర్యం కలగకుండా వసతి ఏర్పాట్లు చేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. దీనితో పాటుగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం ఏరియా ఆస్పత్రికి కూడా ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది.

## మారనున్న సింహాచలం రూపురేఖలు

సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి పుణ్యక్షేత్రంలో పలు అభివృద్ధి పనులకు శంఖుస్థాపన జరిగింది. నాల్కో సంస్థ సీఎస్ఆర్ కింద్ ఇచ్చిన రూ. 1.58 కోట్ల నిధులతో చేపట్టిన షెడ్లకు శంఖుస్థాపన చేశారు. ఇక కోల్‌కతాకు చెందిన ఓ భక్తుడు ఇచ్చిన రూ. 45 లక్షల విరాళంతో తొలిపావంచా వద్ద నిర్మించనున్న షెడ్డుకు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శంఖుస్థాపన చేశారు. అంతేకాకుండా రూ. 3 కోట్లతో నిర్మించిన టీఎంఎస్ షెడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వంపై విమర్శలు చేశారు. సింహాచల ఆలయ ప్రక్షాళన చేసి పూర్వవైభవం తీసుకువస్తామని చెప్పారు.రాష్ట్రంలో ప్రధాన దేవాలయాల్లో ఒకటిగా సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి పుణ్యక్షేత్రం వెలుగొందుతోంది. విశాఖపట్నం జిల్లాలో కొలువై ఉన్న సింహాచలం అప్పన్న స్వామిని దర్శించుకోవడానికి నిత్యం వేలాది మంది భక్తులు తరలివస్తుంటారు. ఆయితే ప్రస్తుతం ఈ ప్రసిద్ధ ఆలయం రూపురేఖలు మారుతున్నాయి. భక్తులు ఇచ్చిన విరాళాలలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్నారు. ఇప్పటికే శ్రీచైతన్య విద్యా సంస్థల వ్యవస్థాపకులు డాక్టర్ బొప్పన ఝాన్సీ లక్ష్మీబాయి.. రూ.3 కోట్లు వెచ్చించి సింహగిరిపై టీఎంఎస్ (టెన్సిల్ మెంబ్రేన్ షెల్టర్) షెడ్డు నిర్మించారు.కాగా, ఈ టీఎంఎస్ షెడ్డు ప్రారంభోత్సవం సింహగిరిపై జరిగింది. ఝాన్సీ లక్ష్మీబాయి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో.. ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, పి గణబాబు పాల్గొన్నారు.

# కూటమి చేతికి మండలి



వైయస్సార్ కాంగ్రెస్ ఎమ్మెల్సీల రాజీనామా వ్యవహారం మరోసారి తెరపైకి వచ్చింది. వారి రాజీనామాలు విషయంలో కోర్టు నాలుగు వారాల పాటు గడువు విధించింది. జయ మంగళం వెంకట్రమణ కోర్టును ఆశ్రయించడంతో ఈ మేరకు తీర్పు వచ్చింది. దీంతో ఏదో ఒక నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం శాసనమండలి చైర్మన్ పై ఏర్పడింది. గత ఏడాది కాలంగా ఎమ్మెల్సీల రాజీనామా వ్యవహారం నలుగుతూనే ఉంది. వైసీపీ రాజకీయ అవసరాల కోసం శాసనమండలి అవసరం. చైర్మన్ మోసేన్ రాజు ఆ పార్టీకి చెందిన నేత కావడంతో హై కమాండ్ నుంచి ఇంతవరకు ఎమ్మెల్సీల రాజీనామా పై ఆదేశాలు రాలేదు. దీంతో చైర్మన్ సైతం ఆ రాజీనామాలను ఆమోదించలేదు. అయితే ఇదే శాసనమండలిని జగన్మోహన్ రెడ్డి వ్యతిరేకించారు. ఇప్పుడు అదే శాసనమండలి ఆయనకు అక్కరకు వస్తోంది.ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత చాలామంది వైయస్సార్ కాంగ్రెస్ ఎమ్మెల్సీలు పార్టీకి గుడ్ బై చెప్పారు. కర్రీ పద్మశ్రీ, పోతుల సునీత, బల్లి కళ్యాణ్ చక్రవర్తి, జయ మంగళ వెంకటరమణ, మర్రి రాజశేఖర్, జాకీయా ఖానం తదితర ఎమ్మెల్సీలు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెప్పారు. తమ ఎమ్మెల్సీ పదవులకు రాజీనామా చేశారు. అయితే రాజీనామా ఆమోదానికి నోచుకోకపోవడంతో వారు తమకు నచ్చిన కూటమి పార్టీల్లో చేరారు. అయితే ఇందులో జనసేనలో చేరిన జయ మంగళం వెంకటరమణ కోర్టును ఆశ్రయించారు. నాలుగు వారాల్లో ఒక నిర్ణయం తీసుకోవాలని కోర్టు ఆదేశించింది. అయితే రాజీనామాలను ఆమోదించిన మరుక్షణం మరికొంతమంది రాజీనామా చేసే అవకాశం ఉంది. అదే జరిగితే శాసనమండలిలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలం తగ్గిపోయినట్టేఇదే శాసనమండలిని జగన్మోహన్ రెడ్డి వ్యతిరేకించారు. 2019లో వైయస్సార్ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. 151 సీట్లతో ఘనవిజయం సాధించింది. అయితే అప్పటికే తెలుగుదేశం పార్టీకి శాసనమండలిలో బలం ఉంది. ఆ పార్టీ నేత మండలి చైర్మన్ గా ఉండేవారు. కీలక బిల్లులతో పాటు వైసీపీ ప్రభుత్వ నిర్ణయాలకు శాసనమండలిలో తెలుగుదేశం పార్టీ అభ్యంతరాలు చెప్పేది. బిల్లులను అడ్డగించేది. దీంతో జగన్మోహన్ రెడ్డి ఏకంగా శాసనమండలిని రద్దు చేయాలని కోరుతూ కేంద్రానికి నివేదిక ఇచ్చారు. అయితే అప్పట్లో కేంద్రం దీనికి సమతం తెలపలేదు. అప్పట్లో కేంద్రం అనుమతి ఇచ్చి ఉంటే ఇప్పటికే రద్దు జాబితాలో శాసనమండలి చేరిపోయేది.2024 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ కూటమికి అనుకూలంగా పనిచేసారని రఘురాజు అనే వైసిపి ఎమ్మెల్సీ పై వేటు వేశారు

చైర్మన్ మోసేన్ రాజు. విజయనగరం స్థానిక సంస్థల ఎమ్మెల్సీ గా ఉన్న రఘురాజు పై వేటు పడడంతో ఎన్నికల సంఘం ఎమ్మెల్సీ ఎన్నికకు సిద్ధపడింది. కానీ కోర్టు స్టే విధించడంతో ఎన్నిక ప్రక్రియ నిలిచిపోయింది. అయితే స్వయంగా ఎమ్మెల్సీలు రాజీనామా చేస్తే మాత్రం చైర్మన్ ఆమోదం తెలపడం లేదు. అయితే ఇప్పుడు జయ మంగళం వెంకటరమణ కోర్టును ఆశ్రయించడంతో.. కోర్టు ఇచ్చే ఆదేశాలు కీలకంగా మారనున్నాయి. ఎమ్మెల్సీల రాజీనామా ఆమోదం తెలిపితే మాత్రం శాసనమండలిలో మిగతా ఎమ్మెల్సీలు సైతం రాజీనామా బాటకు అవకాశం ఉంది. అదే జరిగితే శాసనమండలి సైతం టిడిపి కూటమికి చిక్కినట్టే.

# తిరుమలలో ఏం జరుగుతోంది..

ఆ రెండు కేసులు ఏపీ పాలిటిక్స్‌ను షేక్ చేస్తున్నాయ్. కోట్లాది మంది భక్తుల విశ్వాసం..భక్తుల కొంగుబంగారంగా ఉన్న తిరుమల శ్రీవారి..కొండ చుట్టూ తిరుగుతున్న ఆ రెండు ఇష్యూస్‌పై రచ్చ కంటిన్యూ అవుతోంది. పరకామణి చోరీ కేసు అయితే బిగ్ టర్న్ తీసుకుంది. పరకామణి చోరీ కేసులో నిందితులను ఎప్పుడో గుర్తించారు. అతడి ఆస్తులపై దర్యాప్తు నడుస్తోంది. కీలక సాక్షిగా ఉన్న సతీష్‌కుమార్ అనే అధికారి అనుమానాస్పద మృతి చెందడంతో పరకామని కేసు క్లైమాక్స్‌లో బిగ్ టర్న్ తీసుకున్నట్లు అయ్యింది.ఇక హుండీ చోరీ కేసులో టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకరెడ్డి, టీటీడీ మాజీ ఈవో ధర్మారెడ్డిని సీఐడీ విచారించింది. ప్రశ్నలు వేసి ఏం జరిగిందనే దానిపై ఆరా తీసింది. పరకామణి చోరీ చేసిన రవికుమార్ ఆస్తుల జప్తులో ఏం జరిగింది.? ఎంత చోరీ జరిగితే..ఎన్ని ఆస్తులు జప్తు చేశారు.? రాజీ కుదర్చిందెవరు.? ఎవరి ఒత్తిడి వల్ల ఇదంతా చేశారని.? ఆరా తీస్తుంది సీఐడీ. నిందితులతో భూమన, ధర్మారెడ్డి, వైవీసుబ్బారెడ్డికి ఉన్న లింకులపై కూపీ లాగుతోంది. ఈ క్రమంలోనే సంచలనం సృష్టించిన టీటీడీ పరకామణి కేసులో దర్యాప్తును స్పీడప్ చేశారు సీఐడీ అధికారులు. టీటీడీ మాజీ ఈవో ధర్మారెడ్డిని సీఐడీ మూడుసార్లు ప్రశ్నించిందిపరకామణిలో దొంగతనానికి పాల్పడ్డ వ్యక్తిని కాపాడేందుకు గత ప్రభుత్వంలో కీలకమైన వ్యక్తులే దగ్గరుండి వ్యవహారాన్ని నడిపించారని, చివరకు కేసు పెట్టినా కూడా లోక్ అదాలత్‌లో కొట్టేసేలా ఒత్తిడి తెచ్చారని ఆరోపణలున్నాయి. ఇదంతా జరగడానికి కోట్లు చేతులు మారాయనే అభియోగాలు లేకపోలేదు. ఈ క్రమంలో అన్ని కోణాల్లో దర్యాప్తు అధికారులు విచారిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ కేసు అతిపెద్ద చిక్కుముడిగా మారింది. కీలక సాక్షి లేటెస్ట్‌గా మృతి చెందడంతో కేసు మరింత జఠిలం అవుతోందన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయ్. పరకామణి కేసులో కూడా మరోసారి వైవీ సుబ్బారెడ్డికి సీఐడీ నుంచి పిలుపురావడం రకరకాల చర్చకు దారితీస్తోంది.ఇక తిరుమల కల్తీ నెయ్యి కేసు కూడా కొత్త టర్న్ తీసుకుంటోంది. సుప్రీం ఆదేశాలతో ఏర్పాటైన స్పెషల్ సిట్..ఇప్పటికే టీటీడీ మాజీ ఈవో ధర్మారెడ్డిని విచారించింది. టీటీడీ మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి పీఏ అప్పన్నను అరెస్ట్ చేసింది. లేటెస్ట్‌గా వైవీ సుబ్బారెడ్డిని కూడా హైదరాబాద్‌లోని ఆయన ఇంట్లో ప్రశ్నించింది స్పెషల్ సిట్ టీమ్. అయితే 2019 నుంచి 2014 వరకు జరిగిన నెయ్యి సరఫరాపై మాత్రమే ఎందుకు విచారణ చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు వైవీ సుబ్బారెడ్డిపదేళ్లలో నెయ్యి సప్లైపై విచారణ చేయించాలని డిమాండ్ చేస్తున్నారు. లడ్డూ ఆరోపణలపై పాలీ గ్రాఫ్ పరీక్షకు సిద్దంగా ఉన్నట్లు ప్రకటించిన సుబ్బారెడ్డి..రాజకీయాలకు ఆలయాలను వాడుకుంటున్నారని ఆరోపించారు. స్వామివారి లడ్డూ ప్రసాద విషయంలో తనపై విషప్రచారం చేస్తున్నారని..కల్తీ నెయ్యి వ్యవహారంలో లైడిటెక్టర్ టెస్టుకైనా సిద్ధమని అంటున్నారు వైవీ సుబ్బారెడ్డి. తనకు కోట్ల రూపాయల విలువైన ప్రాజెక్టులు ఉండగా..నెయ్యిలో అవినీతి ఎందుకు చేస్తానని ప్రశ్నిస్తున్నారు. పరకామణి విషయంలో ఏం జరిగిందో తనకు తెలియదంటున్న వైవీ సుబ్బారెడ్డి..శ్రీవారి సేవలో నీతి నిజాయితీతో పనిచేశానని చెప్తున్నారు.అటు దర్యాప్తు సంస్థల విచారణ కొనసాగుతుండగానే..ఏపీ ప్రభుత్వం మాత్రం నిందితుల పట్ల కఠినంగా ఉంటామని తేల్చి చెబుతోంది. తప్పుచేసిన వారిని శ్రీవారు వదిలిపెట్టరని..శిక్ష అనుభవించాల్సిందేనని హెచ్చరిస్తోంది. అయితే కల్తీ నెయ్యి కేసులో సిట్..పరకామణి కేసులో సీఐడీ దర్యాప్తు స్పీడప్ అవడం

ఉత్కంఠ రేపుతోంది. ఓవైపు విచారణ కొనసాగుతుండగానే..ఓవైపు కల్తీ నెయ్యి..ఇంకోవైపు పరకామణి వ్యవహారంపై.. కూటమి, వైసీపీ మధ్య మాటల యుద్ధం సాగుతోంది.సమయం, సందర్భం దొరికినప్పుడల్లా కూటమి లీడర్లు రియాక్ట్ అవడం..తామేం తప్పు చేయలేదని వైసీసీ లీడర్లు వివరణ ఇచ్చుకుంటుండం..హాట్ టాపిక్‌గా నడుస్తోంది. పరకామణి కేసుతో పాటుకల్తీ నెయ్యి ఇష్యూలో కూడా వైవీ సుబ్బారెడ్డి, ధర్మారెడ్డి ఇద్దరు విచారణను ఫేస్ చేస్తుండటం వైసీపీకి హెడెక్‌గా మారింది. భూమన కరుణాకరెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, ధర్మారెడ్డి చుట్టూ ఈ రెండు కేసుల విచారణ కొనసాగుతుండటం బర్నింగ్ టాపిక్ అవుతోంది.అయితే ఈ ముగ్గురు వైసీపీ అధినేతకు జగన్‌కు సన్నిహితులు. వైవీ సుబ్బారెడ్డి అయితే జగన్‌కు బాబాయ్ అవుతారు. భూమన వైఎస్సార్ నుంచి జగన్ వరకు వాళ్ల ఫ్యామిలీ వెంట నడిచిన నేత. ఇక ధర్మారెడ్డి వైసీపీ హయాంలో టీటీడీలో అన్నీ తానై వ్యవహరించారు. ఈ ముగ్గరిని కార్నర్ చేసి..జగన్‌ను రాజకీయంగా వీక్ చేయాలని కూటమి కుట్ర చేస్తోందని ఆరోపిస్తోంది వైసీపీ. పరకామణి కేసు..కల్తీ నెయ్యి ఎపిసోడ్‌లో కన్‌క్లూజన్ ఎప్పుడో వేచి చూడాలి మరి

# 3 లక్షల కోట్లు దాటిన వైజాగ్ డేటా సెంటర్

ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం ఇప్పుడు దేశంలోనే అతిపెద్ద డేటా సెంటర్ల హబ్గా రూపుదిద్దుకుంటోంది. టెక్ దిగ్గజాలు, ప్రపంచ స్థాయి సంస్థలు ఇక్కడ డేటా సెంటర్ల ఏర్పాటుకు క్యూ కట్టడంతో, మొత్తం పెట్టుబడులు ఏకంగా రూ. 3 లక్షల కోట్లకు పైగా చేరినట్లు తెలుస్తోంది.తాజాగా ఈ పెట్టుబడుల సునామీకి ఊతం ఇస్తూ రిలయన్స్ ఇండస్ట్రీస్ మరో భారీ అడుగు వేసింది. రిలయన్స్, బ్రూక్‌ఫీల్డ్ , డిజిటల్ రియాల్టీ వంటి సంస్థల సంయుక్త భాగస్వామ్యంతో ఏర్పాటైన 'డిజిటల్ కనెక్షన్' విశాఖలో ఒక గిగావాట్ సామర్థ్యం గల అత్యాధునిక ఏఐ డేటా సెంటర్‌ను నిర్మించనుంది.ఈ ప్రాజెక్టు కోసం రిలయన్స్ జాయింట్ వెంచర్ సుమారు రూ. 98,000 కోట్లకు పైగా పెట్టుబడి పెట్టనుంది. 1,000 మెగావాట్ల హైపర్‌స్కేల్ ఏఐ డేటా సెంటర్. సుమారు 400 ఎకరాల విస్తీర్ణంలో దీనిని ఏర్పాటు చేయనున్నారు.

2030 నాటికి ఇది అందుబాటులోకి వస్తుందని అంచనా. రిలయన్స్‌తో పాటు ఇప్పటికే ప్రపంచ దిగ్గజ సంస్థలు విశాఖలో భారీ పెట్టుబడులు ప్రకటించాయి. దాదాపు రూ. 1.35 లక్షల కోట్లకు పైగా పెట్టుబడితో 1 %+ఔ% సామర్థ్యం గల ఏఐ డేటా సెంటర్. రూ. 1.10 లక్షల కోట్లతో డేటా సెంటర్ల నిర్మాణం. రూ. 16,000 కోట్ల పెట్టుబడితో 550 మెగావాట్ల సామర్థ్యం గల డేటా సెంటర్ల కాంప్లెక్స్. సబ్‌సీ కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ల ఏర్పాటు, సిఫీతో కలిసి 500 మెగావాట్ల

ఏఐ డేటా సెంటర్ (రూ. 15,266 కోట్లు)మొత్తంగా, రాష్ట్ర ప్రభుత్వం 2030 నాటికి 6,000 మెగావాట్ల డేటా సెంటర్‌ల సామర్థ్యాన్ని లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటికే 3.65 గిగావాట్లకు పైగా ఒప్పందాలు కుదిరాయి. ఈ భారీ పెట్టుబడులతో విశాఖపట్నం రానున్న రోజుల్లో భారతదేశ 'డేటా రాజధాని'గా అవతరించడం ఖాయమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. దీని ద్వారా వేల సంఖ్యలో కొత్త ఉద్యోగాలు, నూతన సాంకేతిక ఆవిష్కరణలకు కేంద్రంగా వైజాగ్ మారనుంది.

# అనుభవం కన్నా అడ్డంకులే ఆటంకాలు

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన అనుభవాన్ని ఉపయోగించి రాష్ట్రాన్ని గాడిలో పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. అందులో ఎలాంటి సందేహం లేదు. కానీ ఈసారి మాత్రం ఆయనకు అనుభవం కన్నా అడ్డంకులే ఆటంకాలుగా మారే అవకాశాలున్నాయి. నిధుల కొరతతో పాటు సంక్షేమాన్ని అమలు చేయడం కత్తిమీద సాముగా మారింది. ప్రతిపక్షం నుంచి వచ్చే విమర్శలను తిప్పికొట్టాలన్న ప్రయత్నంలో ఆయన ఇచ్చిన హామీలను అమలు చేశామని చెప్పేశారు. మహిళలకు నెలకు పదిహేను వందల రూపాయలు ఆడబిడ్డ పథకం కింద.. నిరుద్యోగులకు నెలకు మూడు వేల రూపాయలు ఇస్తామని ఎన్నికలకు ముందు చంద్రబాబు ఇచ్చిన హామీని ప్రతిపక్ష వైసీపీ పదే పదే గుర్తు చేస్తుంది.రెండు పథకాలు అమలు చేయాలంటే అంత సులువు కాదు. ఆడబిడ్డ పథకం అమలు చేయాలంటే ప్రభుత్వానికి చెందిన ఆస్తులు అమ్మాల్సిందేనని

అచ్చెన్నాయుడు గతంలో చేసిన వ్యాఖ్యలు ఈ సందర్భంగా గుర్తుకు తెచ్చుకోవాలి. అర్హులు ఎందరు? ఎవరికి ఇస్తారన్న దానిపై పథకం క్లిక్ అయ్యేది ఆధారపడి ఉంటుంది. ఏదో కొందరికి ఇచ్చామని మమ అనిపించడానికి వీలులేదు. మహిళల్లో ఒకరికి వచ్చి పది మందికి పథకం రాకపోతే ఇరవై మంది వ్యతిరేకమవుతారు. నిరుద్యోగ భృతి కూడా అంతే. అది అమలుకు సాధ్యమయ్యే హామీ కాదు. నిరుద్యోగ యువతకు నెలకు మూడు వేల రూపాయలు ఇవ్వాలంటే ఖజానా సరిపోదు. అందుకే చంద్రబాబు ఆచితూచి వ్యవహరిస్తున్నారు.గతంలో సంక్షేమంపై చంద్రబాబు ఎన్నడూ ఇలా టెన్షన్ పడలేదు. ఆయన దృష్టంతా అభివృద్ధిపైనే ఉంది. గత ప్రభుత్వం అప్పులు చేసిందని, విధ్వంసం నుంచి బయటపడేస్తున్నామని చెప్పాలనుకున్నా కుదిరే పని కాదు. ఎందుకంటే ఇప్పటికే రెండేళ్ల సమయం పూర్తయింది. ప్రస్తుతం గ్రౌండ్ చేసిన హామీలను అమలు చేయడానికే అప్పులు చేయాల్సి వస్తుంది. ప్రతి నెల అప్పుల కోసం ఢిల్లీ వైపు చూడాల్సి వస్తుంది. మరొకవైపు రాజధాని నిర్మాణం, పోలవరం పూర్తి చేయడం వంటివి కూడా సవాలుగా మారుతున్న సమయంలో చంద్రబాబు నాయుడు ఈ రెండు పథకాలను అమలు చేయడానికి అవసరమైన నిధులను సమకూర్చుకోవడానికి తలకిందులు తపస్సు చేసినా సాధ్యం కాదన్నది ప్రతిపక్షం ఆలోచన. అందుకే ఆరెండింటిపైనే ఎక్కువగా విమర్శలు చేస్తున్నారు. మరి చంద్రబాబు ఈ రెండు పథకాల విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది చూడాలి





# రాజకీయ అనైక్యతతోనే.. బ్రిటిష్ సామ్రాజ్య స్థాపన

## పోటీ పరీక్షల ప్రత్యేకం

## భారతదేశ చరిత్ర

1707లో ఔరంగజేబ్ మరణంతో మొగల్ సామ్రాజ్య వైభవం అంతమైంది. ఆ తర్వాత వచ్చిన మొగల్ చక్రవర్తులు బలహీనులు, అసమర్థులు కావడంతో ప్రధానమంత్రుల చేతిలో కీలుబొమ్మలుగా మారారు. దీంతో 18వ శతాబ్ద ప్రారంభంలో భారతదేశ రాజకీయాల్లో ముఖ్య మార్పులు చోటుచేసుకున్నాయి. మొగల్ గవర్నర్లు తిరుగుబాటు చేసి అనేక స్వతంత్ర రాజ్యాలు ఏర్పాటు చేశారు. భారతదేశంలో నెలకొన్న రాజకీయ అనైక్యత, అనిశ్చిత పరిస్థితులు ఆంగ్లేయులకు వరంగా మారాయి. ఒక్కొక్కటిగా రాజ్యాలను జయిస్తూ వచ్చిన ఆంగ్లేయులు భారతదేశంలో ఒక మహా సామ్రాజ్యాన్ని స్థాపించారు.

### కడపటి మొగల్ చక్రవర్తులు

### బహదూర్ షా-I (1707-12)

అసలు పేరు ముఅజ్జం. ఇతడినే షా ఆలం - I అని పిలుస్తారు. ఔరంగజేబ్ మరణానంతరం అతడి ముగ్గురు కుమారుల మధ్య వారసత్వ పోరు జరిగింది. ఇందులో షా ఆలం తన సోదరులైన ఆజం, కాంబక్ష్‌ను చంపి అధికారం చేజిక్కించుకున్నాడు. ఇతడు తన తండ్రి ఔరంగజేబ్ కాలంలో తిరుగుబాటు చేసిన వర్గాలతో సత్సంబంధాలు నెలకొల్పాడు. సిక్కుల గురువు గోవింద్‌సింగ్‌ను మొగలుల సర్వీస్‌లోకి తీసుకోవడంతో సిక్కులు, మొగలులకు మధ్య ఉన్న వైరాన్ని తగ్గించాడు. కానీ తర్వాతి సిక్కుల నాయకుడు బందా బహదూర్ మొగలులపై తిరుగుబాటు చేయగా అతడిని ఓడించాడు. మొగలుల చెరలో ఉన్న శంభాజీ కొడుకు సాహును చెర నుంచి విడిపించాడు. బుందేల పాలకుడు ఛత్రసాల్, సిక్కుల పదో గురువు గురుగోవింద్ సింగ్, జాట్ల నాయకుడు ఛౌరమన్‌తో శాంతి, స్నేహ సంబంధాలు కొనసాగించాడు. ఆనాటి చరిత్రకారుడు కాఫీఖాన్ ఈ మొగల్ చక్రవర్తిని 'షాహిబేఖబరి' (నిర్లక్ష్యం వహించే రాజు) అని పిలిచాడు. షా ఆలం మరణానంతరం ఇతడి ముగ్గురు కుమారులు అంత్యక్రియలు చేయకుండా వారసత్వ పోరు జరిపారు. దీనిలో చివరికి జహందర్ షా గెలిచాడు.

### జహందర్ షా (1712-13)

ఇతడి కాలంలో ప్రధానమంత్రి జుల్ఫికర్ ఖాన్ సర్వాధికారాలు చెలాయించాడు. ఈ కాలంలో రాజ్య పాలన పూర్తిగా గాడితప్పింది. రాజ్య ప్రతిష్ఠ అంతకంతకూ దిగజారిపోయింది. ఇతడి కాలంలోనే ఇజార వ్యవస్థను ప్రవేశపెట్టారు. ఇందులో భాగంగా భూమిశిస్తును మధ్యవర్తుల ద్వారా వసూలు చేసేవారు.

### ఫరూఖ్ సియార్ (1713-19)

ఇతడు జహందర్ షా సోదరుడి కుమారుడు. సయ్యద్ సోదరుల సహకారంతో సింహాసనం అధిష్టించాడు. దీనికి కృతజ్ఞతగా చక్రవర్తి సయ్యద్ అబ్దుల్లా ఖాన్‌కు వజీర్, సయ్యద్ హుస్సేన్ అలీఖాన్‌కు సర్వసైన్యాధ్యక్షుడి పదవులు ఇచ్చాడు. తర్వాతి కాలంలో వీరికి చక్రవర్తితో సఖ్యత కుదరలేదు. ఫరూఖ్ సియార్‌ను సయ్యద్ సోదరులు చంపేశారు. ఇతడి మరణానంతరం రఫీ ఉద్దరత్‌ను చక్రవర్తిగా గుర్తించి సింహాసనం అధిష్టింపజేశారు. కానీ ఇతడు నాలుగు నెలల్లోనే చనిపోయాడు. ఇతడి తర్వాత రఫీ ఉద్దౌలాను షాజహాన్ %××% పేరుతో చక్రవర్తిగా చేశారు.

నోట్: ఫరూఖ్ సియార్ అనారోగ్యం బారిన పడినప్పుడు ఇంగ్లిష్ ఈస్టిండియా కంపెనీ ఒక వైద్య బృందాన్ని ఢిల్లీకి పంపించి వైద్యం అందించింది. దీనికి కృతజ్ఞతగా 1717లో చక్రవర్తి కంపెనీ కోసం ఒక ఫర్మానా జారీ చేశాడు. దీని ప్రకారం, కంపెనీ ఏడాదికి రూ.10 వేలు మొగల్ చక్రవర్తికి చెల్లించి బెంగాల్, దక్కన్, గుజరాత్ రాష్ట్రాల్లో సుంకాలు లేకుండా వ్యాపారం నిర్వహించుకోవచ్చు. దీన్ని ఈస్టిండియా కంపెనీ మాగ్నాకార్టాగా అభివర్ణిస్తారు.

### మహమ్మద్ షా (1719-48)


ఇతడి అసలు పేరు రౌషన్ అక్తర్. మహమ్మద్ షా అనే బిరుదుతో సయ్యద్ సోదరులు ఇతడిని సింహాసనాన్ని అధిష్టింపజేశారు. చక్రవర్తి తల్లి, నిజాం ఉల్ ముల్క్, సాదత్ ఖాన్‌బీ ఇతిమద్ ఉద్దౌలా కూటమిగా ఏర్పడి సయ్యద్ సోదరులను హతమార్చారు.

మహమ్మద్ షా విలాసాలకు అలవాటుపడి పరిపాలనను గాలికి వదిలేశాడు. అంతఃపుర స్త్రీల సాంగత్యంలో గడిపేవాడు దీంతో రంగీలా (విలాస పురుషుడు)గా పేరుగాంచాడు. హిందూ, ముస్లిం సంప్రదాయాల సమ్మేళనంతో ప్రారంభమైన కథక్ నృత్యంలో ఈ చక్రవర్తి బహుప్రావీణ్యుడు. అంబర్ పాలకుడు సవాయ్ జైసింగ్ ఖగోళశాస్త్రానికి సంబంధించి జిజ్ మహమ్మద్ షాహిని రచించి చక్రవర్తికి అంకితమిచ్చాడు.

మహమ్మద్ షా కాలంలోనే మొగల్ సామ్రాజ్య విచ్ఛిన్నం వేగవంతమైంది. ఇద్దరు ప్రధాన అధికారులు రెండు స్వతంత్ర రాజ్యాలను స్థాపించారు. వారు:

**సాదత్‌ఖాన్:** మొగల్ అధికార గణంలోని ఇరానీ వర్గానికి నాయకుడు. వీరు ఇరాన్ నుంచి వలస వచ్చిన షియా మతానికి చెందినవారు. ఇతడు 1722లో అవధ్ రాజ్యాన్ని స్థాపించాడు. ప్రారంభంలో ఫైజాబాద్, తర్వాత లక్నో ఈ రాజ్యానికి రాజధానులు.

**నిజాం-ఉల్-ముల్క్:** అసలు పేరు మీర్ కమ్రుద్దీన్ ఖాన్. బిరుదులు అసఫ్ జా, చిన్ కులిచ్ ఖాన్. ఇతడు మొగల్ అధికార గణంలోని తురానీ వర్గ నాయకుడు. వీరు మధ్య ఆసియా నుంచి వలస వచ్చిన సున్నీ మతానికి చెందినవారు. 1724లో నిజాం-ఉల్-ముల్క్ తిరుగుబాటు చేసి దక్కన్‌లో నిజాం రాజ్యాన్ని స్థాపించాడు. ప్రారంభంలో ఈ రాజ్య రాజధాని ఔరంగాబాద్. ఆ తర్వాత రాజధానిని హైదరాబాద్‌కు మార్చారు.





### నాదిర్షా దండయాత్ర

క్రీ.శ.1739లో ఇరాన్ నెపోలియన్‌గా ప్రసిద్ధిగాంచిన నాదిర్షా భారతదేశంపై దండెత్తాడు. కర్నాల్ వద్ద జరిగిన నామమాత్రపు యుద్ధంలో మహమ్మద్ షాను ఓడించి భారతదేశాన్ని దోచుకున్నాడు. కోహినూర్ వజ్రం, నెమలి సింహాసనంతో పాటు 70 కోట్ల సంపదను దోచుకెళ్లాడు. మహమ్మద్ షా నెమలి సింహాసనంపై కూర్చున్న చివరి మొగల్ చక్రవర్తి.

### అహమ్మద్ షా (1748-54)

మహమ్మద్ షా మరణానంతరం అతడి కుమారుడు అహమ్మద్ షా రాజయ్యాడు. ఇతడి కాలంలో ప్రధానమంత్రి ఇమాద్-ఉల్-ముల్క్ సర్వాధికారాలు చెలాయించాడు. చక్రవర్తితో విభేదాలు రావడంతో కళు పీకించి చెరసాలలో బంధించాడు. ఇతడి కాలంలోనే నాదిర్షా సేనాపతిగా పనిచేసిన, ఆఫ్ఘనిస్థాన్ పాలకుడైన అహమ్మద్ షా అబ్దాలీ దాడులు ప్రారంభమయ్యాయి. ఇతడు 1748 నుంచి 1767 మధ్య భారతదేశంపై ఎనిమిదిసార్లు దండెత్తాడు.

### ఆలంగీర్- II (1754-59)

అసలు పేరు అజీజుద్దీన్. ఇతడు జహందర్ షా మనవడు. రెండో ఆలంగీర్ అనే బిరుదుతో పరిపాలన కొనసాగించాడు. (ఔరంగజేబ్‌ను ఆలంగీర్‌ఖిగా పిలుస్తారు). ఇతడి కాలంలో ఆర్థిక, సైనిక వ్యవస్థలు దిగజారిపోయాయి. జీతాలు కూడా చెల్లించలేని స్థితిలోకి వచ్చారు. ఆఫ్ఘనిస్థాన్ పాలకుడు అహమ్మద్ షా అబ్దాలీ ఢిల్లీపై దండెత్తి దోచుకున్నాడు. ప్రధానమంత్రి ఇమాద్-ఉల్-ముల్క్ ఆలంగీర్-II ను చంపి, మృతదేహాన్ని యమున నదిలో పడేశాడు.

### షా ఆలం-III (1759-1806)

అసలు పేరు అలీగౌహర్. రెండో ఆలంగీర్ కుమారుడు. ఇతడు బిహార్‌లో పట్టాభిషిక్తుడు అయ్యాడు. కానీ ప్రధానమంత్రి ఇమాద్-ఉల్-ముల్క్ పట్ల భయంతో 12 ఏళ్లు ఢిల్లీలో అడుగుపెట్టకుండా అవధ్‌లో శరణార్థిగా గడిపాడు. ఇతడి కాలంలోనే మొహి-ఉల్-మిల్లత్ అనే యువరాజును షాజహాన్- III అనే బిరుదుతో సింహాసనంపై కూర్చోబెట్టి ప్రధానమంత్రి ఇమాద్ పరిపాలన గావించాడు.


ఇమాద్ మరణం తర్వాత 1772లో మహదాజి సింధియా అనే మరాఠా సర్దార్ సహకారంతో షా ఆలం-%××% ఢిల్లీకి వచ్చి సింహాసనం అధిష్టించాడు. 1803లో ఆంగ్లేయ సేనాని లార్డ్ లేక్ ఢిల్లీని ఆక్రమించి బ్రిటిష్ సామ్రాజ్యంలో విలీనం చేయడంతో మొగల్ పాలన అంతమైంది. షా ఆలం-II ఈస్టిండియా కంపెనీకి పెన్షనర్ అయ్యాడు. అనంతరం వచ్చిన మొగల్ చక్రవర్తులు ఆంగ్లేయులు ఇచ్చిన రాజభరణంతో జీవించారు.

### అక్బర్-II (1806-37)

ఇతడికి ఆంగ్లేయులు ఏడాదికి 11,50,000 పెన్షన్ (రాజభరణం) ఇచ్చేవారు. ఇతడు సంఘ సంస్కర్త రామ్మోహన్ రాయ్‌కు 'రాజా' అనే బిరుదు ఇచ్చాడు. రామ్మోహన్ రాయ్ బ్రిటిషర్లు మొగల్ చక్రవర్తికి ఇచ్చే పెన్షన్ పెంపు గురించి చర్చించేందుకు ఇంగ్లండ్ వెళ్లాడు.

### బహదూర్ షా-II (1837-57)

ఇతడు మొగల్ వంశంలో చివరి చక్రవర్తి. అబుల్ జాఫర్ అనే పేరుతో ఉర్దూలో కవితలు రచించాడు. 1857లో జరిగిన సిపాయిల తిరుగుబాటుకు నాయకత్వం వహించడంతో ఆంగ్లేయులు ఇతడిని బందీగా 1858లో బర్మాలోని రంగూన్‌కు పంపించారు. ఇతడు 1862లో రంగూన్‌లోనే మరణించడంతో అక్కడే సమాధి చేశారు. దీంతో మొగల్ వంశం సంపూర్ణంగా అంతమైంది.



# ఇవీ క్లోమ క్యాన్సర్ సంకేతాలే

తరచూ చూసేవే కావొచ్చు. అవి తీవ్ర సమస్యలేమీ కాకపోవచ్చు. అయినా కూడా కొన్నిసార్లు ప్రమాదకర జబ్బులకు సూచికలు కావొచ్చు. నడుం నొప్పి, అజీర్ణం అలాంటివే. వీటికి చాలావరకూ కండరాలు పట్టేయటం, జీవనశైలి మార్పులు, జీర్ణాశయంలోని ఆమ్లం గొంతులోకి ఎగదన్నుకు రావటం వంటివే కారణమవుతుంటాయి. అలాగని నిర్లక్ష్యం పనికిరాదు. కొన్నిసార్లు ఇవి క్లోమ (పాంక్రియాస్) క్యాన్సర్ లక్షణాలు కావొచ్చు. ముఖ్యంగా నడుం నొప్పి, అజీర్ణం అదేపనిగా, నెలలకొద్దీ విడవకుండా వేధిస్తుంటే అనుమానించటం మంచిది. కడుపు లోపల, జీర్ణాశయం వెనకాల క్లోమగ్రంథి దాగుంటుంది. ఇందులో కణితులు తలెత్తినా తొలిదశలో పెద్దగా లక్షణాలేవీ ఉండవు. కొన్నిసార్లు ఇది నడుంనొప్పి, అజీర్ణం వంటి అస్పష్ట లక్షణాలతోనూ బురిడీ కొట్టిస్తుంటుంది. దీంతో ఇతరత్రా సమస్యలుగా పొరపడుతుంటారు. ఇంతకీ క్లోమ క్యాన్సర్‌లో నడుంనొప్పి, అజీర్ణం ఎందుకు వస్తాయి? కణితి వృద్ధి చెందుతున్నకొద్దీ చుట్టుపక్కల నాడులను, కణజాలాలను నొక్కటం మొదలెడుతుంది. దీంతో కడుపు పైభాగంలో నిరంతరం నొప్పి కలుగుతుంటుంది. ఇది కొందరికి వీపునకూ విస్తరించొచ్చు. ఈ నొప్పి పడుకున్నప్పుడు తీవ్రమవు తుంటుంది. ముందుకు వంగి కూర్చునప్పుడు హాయిగా అనిపిస్తుంటుంది. ఇక అజీర్ణం దగ్గరికి వస్తే- కణితి ఏర్పడినప్పుడు పాంక్రియాస్‌లో జీర్ణ ఎంజైమ్‌ల ఉత్పత్తి పడిపోతుంది. దీంతో తిన్నది సరిగా జీర్ణం కాకపోవటం, కడుపుబ్బరం, మల విసర్జనలో మార్పుల వంటివి మొదలవుతాయి. కొందరికి కారణమేదీ లేకుండా వికారంగా అనిపించటం, కొంచెం తినగానే కడుపు నిండటం, ఆకలి తగ్గటం కూడా ఉండొచ్చు. చాలామందిలో బాగా ముదిరిన తర్వాతే క్లోమ క్యాన్సర్ బయటపడుతున్న నేపథ్యంలో ఇలాంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయటం తగదు. దీర్ఘకాలంగా నడుంనొప్పి, అజీర్ణంతో బాధపడుతుంటే ఒకసారి డాక్టర్‌ను సంప్రదించి, వాటికి కారణమేంటన్నది తెలుసుకోవటం చాలా ముఖ్యం.

# లెక్క సరి చేస్తారా

## సఫారీలతో ఇక వన్డే పోరు

## చాన్నాళ్ల తర్వాత సొంతగడ్డపై రో-కో

## మధ్యాహ్నం 1.30నుంచి

కోల్‌కతాలో దక్షిణాఫ్రికాతో టెస్టు సిరీస్‌ను మెరుగ్గానే ఆరంభించిన టీమ్ఇండియా.. చివరికి వైట్‌వాష్‌కు గురవుతుందని అభిమానులు ఏమాత్రం ఊహించి ఉండరు! ఇప్పుడిక అదే జట్టుతో పరిమిత ఓవర్ల క్రికెట్ పోరు మొదలు కాబోతోంది. ముందుగా వన్డే సమరానికి ఆదివారమే శ్రీకారం. ఎర్రబంతి ఆటలో ఎదురైన పరాభవానికి తెల్లబంతి పోరులో సమాధానం చెప్పాలని అభిమానులు కోరుకుంటున్నారు. ఏడాదికి పైగా విరామం తర్వాత రోహిత్, కోహ్లి స్వదేశంలో అంతర్జాతీయ క్రికెట్ ఆడుతుండటంతో అందరి దృష్టీ వారిపైనే ఉంది. ధోని సొంతగడ్డ రాంచి ఈ మ్యాచ్‌కు వేదిక కావడం విశేషం.



కొంత విరామం తర్వాత భారత క్రికెట్ అభిమానులకు స్టార్ ఆటగాళ్లు కోహ్లి, రోహిత్‌లను మళ్లీ మైదానంలో చూసే అవకాశం వచ్చింది. దక్షిణాఫ్రికాతో ఆదివారం రాంచిలో జరిగే తొలి వన్డేలో వీళ్లిద్దరూ బరిలోకి దిగుతున్నారు. మూడు మ్యాచ్‌ల ఈ సిరీస్‌కు వీరే ప్రత్యేక ఆకర్షణ. కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌తో పాటు వైస్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ గాయాలతో జట్టుకు దూరం కావడంతో సిరీస్‌లో కేఎల్ రాహుల్ భారత్‌ను నడిపించబోతున్నాడు. టెస్టు జట్టులో సుస్థిర స్థానం సంపాదించుకుని.. పరిమిత ఓవర్ల క్రికెట్లో సత్తా చాటాలని చూస్తున్న యశస్వి జైస్వాల్‌కు ఈ సిరీస్ మంచి అవకాశమే. ఈ సిరీస్‌లో నెగ్గి టెస్టుల్లో వైట్‌వాష్ తాలూకు జ్ఞాపకాలను చెరిపేయాలని టీమ్ఇండియా చూస్తోంది.

నిలిచేదెవరో?: టెస్టు ఫార్మాట్‌కు దూరమయ్యాక ఆడిన తొలి సిరీస్‌లో రో-కోలపై అందరి దృష్టి నిలిచి ఉండగా.. వాళ్లిద్దరూ మెరుగ్గానే రాణించారు. రోహిత్ ఓ సెంచరీ, ఓ అర్ధసెంచరీతో అదరగొట్టగా.. కోహ్లి ఒక అర్ధశతకం సాధించారు. సొంతగడ్డపై ఇద్దరూ ఇంతకుమించి రాణించాలని అభిమానులు ఆశిస్తున్నారు. రాంచి వారికి అలవాటైన మైదానమే. 2027 ప్రపంచకప్ లక్ష్యంగా వన్డేల్లో కొనసాగతున్న రో-కో.. ఈ సిరీస్‌లో సత్తా చాటి ఆ దిశగా ముందడుగు వేస్తారేమో చూడాలి. శుభ్‌మన్ అందుబాటులో లేని నేపథ్యంలో రోహిత్‌తో కలిసి యశస్వి ఇన్నింగ్స్‌ను ఆరంభిస్తాడు. యశ[illegible]ంగ్స్‌లు ఆడి వన్డే జట్టులో నిలదొక్కుకోవాలని చూస్తున్నాడు. కెప్టెన్ రాహుల్ అయిదో స్థానంలో ఆడతాడు. అతనే వికెట్ కీపింగ్ బాధ్యతలు నిర్వర్తిస్తాడు. నాలుగో స్థానం కోసం స్పెషలిస్టు వికెట్ కీపర్ రిషబ్ పంత్, రుతురాజ్ గైక్వాడ్ మధ్య పోటీ నెలకొంది. మరి ఎవరికి చోటు దక్కుతుందో చూడాలి. ఛాంపియన్స్ ట్రోఫీ తర్వాత ఇప్పుడే వన్డేలు ఆడబోతున్న రవీంద్ర జడేజా, ఈ ఏడాది అన్ని ఫార్మాట్లలో నిరాశ పరుస్తున్న నితీశ్ కుమార్ రెడ్డిలతో పాటు వాషింగ్టన్ సుందర్ మిడిలార్డర్లో కీలకం. వీరి నుంచి జట్టు బౌలింగ్ మెరుపులూ ఆశిస్తోంది. బుమ్రా, సిరాజ్ లాంటి సీనియర్లు అందుబాటులో లేని నేపథ్యంలో యువ పేసర్లు అర్ష్‌దీప్, ప్రసిద్ధ్ కృష్ణ, హర్షిత్ రాణా పేస్ భారాన్ని ఎంత సమర్థంగా మోస్తారో చూడాలి. బలమైన దక్షిణాఫ్రికా బ్యాటింగ్ విభాగంతో వీరికి ముప్పు పొంచి ఉంది.

ఉత్సాహంతో దక్షిణాఫ్రికా: టెస్టు సిరీస్‌లో ఘనవిజయం సాధించిన దక్షిణాఫ్రికా.. ఆత్మవిశ్వాసంతో వన్డే సిరీస్‌ను ఆరంభించబోతోంది. అయితే వన్డేల్లో తుది జట్టులో చాలా మార్పులే చూడబోతున్నాం. టెస్టు జట్టు నుంచి కెప్టెన్ బవుమాతో పాటు మార్‌క్రమ్, యాన్సెన్, కేశవ్ మహరాజ్, కార్బిన్ బోష్‌లను ఈ సిరీస్‌లో చూడబోతున్నాం. బవుమా, మార్‌క్రమ్‌లకు తోడు దూకుడుగా ఆడే డికాక్, బ్రీట్జ్‌కే, బ్రెవిస్, రుబిన్ హెర్మన్ భారత బౌలర్లకు సవాలు విసరడం ఖాయం. గాయం కారణంగా ప్రధాన పేసర్ రబాడ దూరం కావడం సఫారీ జట్టుకు ప్రతికూలతే. అయితే యాన్సెన్, బర్గర్, ఎంగిడి, బోష్‌లతో పేస్ విభాగం మెరుగ్గానే ఉంది. స్పెషలిస్టు స్పిన్నర్ కేశవ్ మహరాజ్‌కు తోడు మార్‌క్రమ్ స్పిన్ బాధ్యతలు పంచుకోనున్నాడు.

**పిచ్.. నెమ్మది!**

రాంచిలో ఇప్పటిదాకా అయదు వన్డేలు మాత్రమే జరిగాయి. వాటిలో భారీ స్కోర్లు నమోదు కాలేదు. ఒక్కసారి మాత్రమే స్కోరు 300 దాటింది. ఇక్కడి పిచ్ కొంచెం నెమ్మదిగా ఉంటుంది. ఆదివారం 270-280 మధ్య స్కోరు నమోదయ్యే అవకాశముంది. 300 చేస్తే గెలిచేందుకు మెరుగైన అవకాశాలుంటటాయి. ఇక్కడ స్పిన్నర్లు బాగా ప్రభావం చూపిస్తారు. రాత్రి మంచు ప్రభావం ఉంటుంది కాబట్టి టాస్ గెలిచిన జట్టు ఛేదనకే మొగ్గు చూపొచ్చు.

తుది జట్లు (అంచనా)

భారత్: యశస్వి, రోహిత్, కోహ్లి, రుతురాజ్/పంత్, రాహుల్ (కెప్టెన్), సుందర్, జడేజా, నితీశ్, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్, ప్రసిద్ధ్.

దక్షిణాఫ్రికా: మార్‌క్రమ్, డికాక్, బవుమా (కెప్టెన్), బ్రీట్జ్‌కే, బ్రెవిస్, రుబిన్ హెర్మన్, యాన్సెన్, బోష్, కేశవ్, బర్గర్, ఎంగిడి.

# భారత్ గోల్స్ వర్షం

## 17-0తో ఒమన్‌పై ఘనవిజయం

## జూనియర్ హాకీ ప్రపంచకప్

## 17-0తో ఒమన్‌పై ఘనవిజయం



చెన్నై: చిలీపై 7-0 విజయంతో జూనియర్ హాకీ ప్రపంచకప్‌ను ఘనంగా ఆరంభించిన భారత్.. రెండో మ్యాచ్‌లో మరింత రెచ్చిపోయింది. శనివారం పూల్-బి మ్యాచ్‌లో ఆతిథ్య జట్టు ఏకంగా 17-0 తేడాతో ఒమన్‌ను చిత్తు చేసింది. 4వ నిమిషంలో మొదలైన భారత్ గోల్స్ వర్షం.. చివరిదాకా కొనసాగింది. మ్యాచ్ ఆద్యంతం భారత్ దాడులను కాచుకోవడానికే సరిపోవడంతో ఒమన్ గోల్ ప్రయత్నమే చేయలేదు. అర్ష్‌దీప్ సింగ్ (4వ నిమిషం, 33వ, 40వ), మన్‌జీత్ సింగ్ (17వ, 26వ, 36వ), దిల్‌రాజ్ సింగ్ (29వ, 32వ, 58వ) తలో మూడు గోల్స్ సాధించగా.. గుర్‌జ్యోత్ సింగ్ (39వ, 45వ), అజీత్ యాదవ్ (34వ, 47వ), లువాంగ్ (43వ, 50వ) రెండుసార్లు చొప్పున స్కోర్ చేశారు. అన్మోల్ (29వ), శార్దానంద్ (55వ) చెరో గోల్ కొట్టారు. శనివారం ఇతర మ్యాచ్‌ల్లో మలేసియా 5-1తో ఆస్ట్రియాపై, నెదర్లాండ్స్ 5-3తో ఇంగ్లాండ్‌పై విజయాలు సాధించాయి.

# నాగార్జున- జాకీ ష్రాఫ్ మధ్య ఈ కనెక్షన్ గురించి తెలుసా?



అక్కినేని నాగేశ్వరరావు నటవారసుడిగా కింగ్ నాగార్జున తన తండ్రి లెగసీని ముందుకు నడిపించడంలో విజయవంతం అయ్యారు. నేడు టాలీవుడ్ మూల స్థంభాలలో ఆయన ఒకరు. అగ్ర కథానాయకుడిగా దశాబ్ధాల పాటు పరిశ్రమను ఏలిన నాగార్జున సినీనిర్మాతగాను తనదైన ముద్ర వేసారు. అన్నపూర్ణ స్టూడియోస్ అధినేతగా విజయవంతమైన వ్యాపారవేత్తగా, ఎంటర్ ప్రెన్యూర్ గాను సత్తా చాటారు.అయితే కింగ్ నాగార్జున నటుడు ఎలా అయ్యారు? ఆయన మొదటి సినిమా ఎంపిక వెనుక ఎవరున్నారు? అతడికి బాలీవుడ్ నటుడు జాకీ ష్రాఫ్ తో ఉన్న కనెక్షన్ ఏమిటి? ఇవన్నీ తెలుసుకుంటే అభిమానులకు నిజంగా బిగ్ సర్ ప్రైజ్. అసలు నాగార్జున %-%విక్రమ్%-% సినిమాని ఎంపిక చేసినది - అక్కినేని నాగేశ్వరరావు. ఇదే సినిమాతో బాలీవుడ్ లో జాకీ ష్రాఫ్ కూడా డెబ్యూ నటుడిగా ఆరంగేట్రం చేసాడు. ఒకే సమయంలో ఒకేసారి నాగార్జున, జాకీ ష్రాఫ్ ఆరంగేట్రం చేయడం అప్పట్లో ఒక పెద్ద విషయం. ఎయిటీస్ క్లాస్ హీరోల్లో ఇప్పటికీ జాకీ ష్రాఫ్ నాగార్జునకు కనెక్ట్ అయి ఉన్నారు. అతడు నాగార్జున, చిరంజీవి, వెంకటేష్ లాంటి నటులకు అత్యంత సన్నిహితుడు.కింగ్ నాగార్జునకు %-%విక్రమ్%-% సినిమా ఆశించిన విజయాన్ని ఇవ్వలేదు. ఆ తర్వాత అతడు మజ్ను, జానకి రాముడు, విక్కీ దాదా లాంటి హిట్ చిత్రాల్లో నటించాడు. రామ్ గోపాల్ వర్మతో %-%శివ%-% సినిమా ట్రెండ్ సెట్టర్ గా మారింది. ఈ సినిమా కల్ట్ క్లాసిక్ హిట్ గా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఆర్జీవీని దర్శకుడిగా పరిచయం చేస్తూ నాగార్జున స్వయంగా అన్నపూర్ణ బ్యానర్ లో నిర్మించిన ఈ చిత్రం దర్శకహీరోలిద్దరికీ బిగ్ బ్రేక్ నిచ్చింది.కెరీర్ ఆరంభం ఎన్నో స్ట్రగుల్స్ ఎదుర్కొన్న నాగార్జున, జాకీ ష్రాఫ్ వారు ఎంపిక చేసుకున్న క్రాఫ్ట్ లో మాస్టర్స్ అయ్యారు. ఇద్దరూ ప్రయోగాత్మక పంథాలో కెరీర్ ని నడిపించారు. జాకీ ష్రాఫ్ సహాయనటుడిగా, హీరోగా వైవిధ్యమైన పాత్రలతో మెప్పించారు. ఒక నటవారసుడిగా తెరంగేట్రం చేసినా నాగార్జున ప్రయోగాల బాటలో తనదైన మార్క్ వేస్తూ ఇండస్ట్రీ బెస్ట్ హీరోగా నిరూపించారు.



PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com